
ఉష్ణోగ్రత (అంచనా)

23-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	26
తెనాలి	39	27
నరసరావుపేట	41	23
బాపట్ల	37	27
రెంటచింతల	42	23

ప్లానిస్తే.. పాట్లే

మున్సిపాల్టీల్లో నిర్మాణాలను ప్రోత్సహించాలని.. ప్లాన్లకు అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా.. నిర్మాణ దారులకు ప్లాన్ అప్రూవల్ కష్టాలను తప్పించాలని.. ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేసింది. అయితే ఈ నిర్ణయం నిర్మాణదారులకు మేలు చేసేదిగా ఉన్నా తమకు కష్టాలు తెచ్చి పెడుతుందని లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లు(ఎల్‌టీపీ) వాపోతున్నారు. ప్లాన్లలో అతిక్రమణ జరిగితే ఎల్‌టీపీలను బాధ్యులు చేస్తూ సరికొత్తగా నిబంధనలు విధించడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానం వల్ల పట్టణంలో ప్రతి బిల్డింగ్ నిర్మాణానికి నిబంధనలు పాటించాలి. తప్పు జరిగిందా యాజమాని, ప్లానర్‌పై ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ఈ పరిస్థితుల్లో ప్లాన్ అప్‌లోడు చేసి కష్టాలు తెచ్చుకోవడం ఎందుకనే భావనలో ఎల్‌టీపీలు ఉన్నారు. దీంతో గత నెలన్నరుగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీలో ఎల్‌టీపీల నుంచి ప్లాన్లు అప్‌లోడు కావడంలేదు. దీంతో నిర్మాణదారులు శంకుస్థాపనలు చేసుకుని ప్లాన్ల ఆమోదం కోసం ఎదురు చూస్తున్నారు. మున్సి పాల్టీల్లో ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాల ప్లాన్ల విషయంలో ప్రభుత్వం ఒకవిధంగా ఆలోచిస్తే అది మొదటికే నష్టం చేకూర్చిందన్న భావన అటు నిర్మాణ దారుల్లో.. ఇటు లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లలోనూ వ్యక్తమవుతోంది.





- లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లలో ఆందోళన
- మున్సిపాల్టీల్లో కొత్త నిబంధనలపై వ్యతిరేకత
- అతిక్రమణలపై కేసులతో ఎల్‌టీపీలు వెనుకంజ
- పట్టణాల్లో నెలన్నరగా దాఖలు కాని ఇంటి ప్లాన్లు
- ప్లాన్లు ఆమోదం కాక స్తంభించిన కొత్త నిర్మాణాలు

ఎల్‌టీపీలదే బాధ్యత..

ఎల్‌టీపీ అంటే.. ప్లాన్ గీయడం. అప్రూవల్ చేయించడంతో పని పూర్తి కాదు. నిర్మాణానికి సంబంధించి ఫౌండేషన్ నుంచి వివిధ స్థాయిల్లో ఫొటోలు తీసి సర్వర్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్లాన్‌తో పాటు దాఖలు చేసిన అన్ని ధ్రువపత్రాలు సక్రమమని ఎటువంటి తేడాలు లేవని నిర్ధారిస్తూ సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. ఇంత రిస్క్ చేసి ప్లాన్లు రూపొందించి ఇబ్బందులు ఎందు ర్కోలేమన్న వాదనను ఎల్‌టీపీలు వినిపిస్తున్నారు. అన్నీ పరిశీలించి ప్లాన్ తయారు చేయ డం కష్టతర మంటున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- గత 45 రోజులుగా నరసరావుపేట మున్సిపాల్టీలో ఇంటి ప్లాన్ కోసం ఒక్క దరఖాస్తు మా త్రమే దాఖలైంది.
- గత నెలన్నరుగా మున్సిపల్ పట్టణాల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్ల నుంచి ఇళ్ల ప్లాన్ల దరఖాస్తులు అప్‌లోడు కావడంలేదు.

.. మున్సిపల్ పట్టణాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఎవరూ ముందుకు రావడంలేదా. ప్లాన్లకు ఆమోదం లభించిక పెండింగ్‌లో ఉంటున్నాయా. నిర్మాణ సామాగ్రి ధరలు పెరిగి ఎవరూ ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రావడంలేదా... అంటే కాదు. అసలు ప్లాన్లు గీసేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్లు ధైర్యం చేయడంలేదు. ఒక వేళ గీసినా ఆ ప్లాన్లను వారు అప్‌లోడు చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీల్లో ఇంటి ప్లాన్ల ఆమో దానికి సంబంధించి తీసుకొచ్చిన సరికొత్త నిబంధనలే దీనికంతటికీ కారణమని తెలుస్తోంది. పట్టణాల్లో ఇళ్ల నిర్మాణ ప్లాన్ల అనుమతులకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ ద్వారా ప్లాన్లను మంజూరు చేస్తోంది. ఇది భవన నిర్మాణదారులకు ఎంతో మేలు చేస్తుందని ప్రభుత్వం భావించింది. అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని ప్రకటించింది. ప్రభుత్వ ఆశయం ఉన్నతంగా ఉన్నా.. కొత్త నిబంధనల మేర ప్లాన్ దాఖలు చేసేందుకు ఎల్‌టీ పీలు ససేమిరా అంటున్నారు. దీంతో మున్సిపాల్టీల్లో కొత్త నిర్మాణాలు స్తంభించిపోయాయి. గతంలో టౌన్ ప్లానింగ్

(మిగతా 8వ పేజీలో)

రైల్వేకు బ్లాక్‌స్పాట్ల భయం

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుం టూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రైల్వే ట్రాక్‌పైకి పశువులు, మనుషులు ఇష్టం వచ్చినట్లు వచ్చేస్తున్నారు. డివిజన్ మొత్తం మీద 290 చోట్ల ట్రాక్ అతిక్రమణలు జరుగుతున్నట్లు రైల్వే మెకానికల్ విభాగం గుర్తించింది. రైల్వేట్రాక్‌ల అతిక్రమణల కారణంగా రైళ్ల భద్రతకు ముప్పు వాటిల్లుతున్నది. పశువులను 110 కిలోమీటర్ల వేగంతో వెళుతున్న రైలు ఢీకొంటే లోకో(ఇంజిన్) దెబ్బతింటున్నది. అంతేకాకుండా పైలట్లు అత్యవసర బ్రేకులు వేస్తుండటంతో రైలు పట్టాలు తప్పే పరిస్థితులు ఉత్పన్నమౌతున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వే రక్షక దళం, జీఆర్‌పీ అధికారులకు హాట్‌స్పాట్ల సమాచారం ఇచ్చి అక్కడి ప్రజలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పశువులను రైల్వేట్రాక్‌లకు సమీపంలోకి తీసుకు రానీయకుండా కొంతమేరకు నియంత్రిస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రం గుంతలు తవ్విస్తున్నారు. అయితే రైల్వేట్రాక్‌ల అతిక్రమణను నిరోధించడానికి ఇది శాశ్వత పరిష్కారం కాదు. క్రాష్ బ్యారియర్స్‌ని నిర్మిస్తేనే పశువులు అతిక్రమించకుండా నిరోధించే అవకాశం ఉంటుంది. గుంటూరు డివిజన్‌లో ఉన్న సెక్షన్లన్నింటిలో 110 కిలోమీటర్ల వేగంతోనే రైళ్లు నడపడానికి కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ అనుమతి ఉన్నది. దీంతో క్రాష్ బ్యారియర్స్ ఏర్పాటు చేయలేని పరిస్థితి. ఈ కారణంగా వీటిలో కొన్ని చోట్ల అతిక్రమణలను నివారించేందుకు ట్రెంచ్ కొట్టించడం (పొడవాటి గుంత తవ్వించడం) చేయిస్తున్నది. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఏ ఒక్క సెక్షన్‌లోనూ 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిచేందుకు అనుమతి లేకపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ ని బంధన ఉంటేనే రైల్వే శాఖ ఆయా సెక్షన్లలో రైల్వేట్రాక్ అతిక్రమణ జరగకుండా బ్యారికేడింగ్ పనులకు అనుమతిస్తుంది.

- గుంటూరు డివిజన్‌లో 290 చోట్ల ట్రాక్ అతిక్రమణ
- బ్యారికేడింగ్ లేకపోవడంతో ట్రాక్‌పైకి పశువులు, మనుషులు
- 110 కిలోమీటర్ల వేగంతోనే రైళ్ల రాకపోకలకు సేఫ్టీ కమిషనర్ అనుమతి



ట్రాక్ పక్కన పశువులను తోలుకెళుతున్న కాపరి

డబ్లింగ్ తర్వాతే 130 కిమీ వేగం..

రేపల్లె - తెనాలి, కృష్ణాకెనాల్ - గుంటూరు, నంద్యాల - గుంటూరు, పగిడిపల్లి - గుంటూరు, న్యూపిడుగురాళ్ల - శావల్యాపురం సెక్షన్లు గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఉన్నాయి. వీటిల్లో డబుల్ లేన్(రెండు వరసల రైలు మార్గం) ఉన్న సెక్షన్లు కృష్ణాకెనాల్ - గుంటూరు, తెనాలి - గుంటూరు, గుంటూరు - దిగువమెట్ట మాత్రమే. మిగతా సెక్షన్లన్నీ సింగిల్ లేన్‌వే. గుంటూరు - పగిడిపల్లి డబ్లింగ్ పనులు ఇటీవలే మొదలయ్యాయి. అన్ని సెక్షన్లు డబ్లింగ్ పూర్తి అయితే తప్ప 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిపేందుకు సీఆర్ఎస్ అనుమతి ఇవ్వదు. అప్పటివరకు ప్రస్తుతం అనుమతి ఉన్న వేగంతోనే రైళ్లు నడుపుకోవాల్సిన పరిస్థితి. ఈ కారణంగా రైలుమార్గాలకు బ్యారికేడింగ్ చేసే అవకాశం లేకపోవడంతో పశువులు, మనుషుల అతిక్రమణలు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి.

ఏఐ-పవర్డ్ థర్మల్, స్టాండర్డ్ కెమెరాలు అవసరం

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో నంద్యాల - గుంటూరు సెక్షన్‌లో నల్లమల అటవీ ప్రాంతం ఉన్నది. అక్కడ తరచుగా రైళ్లు ఢీకొని వన్యప్రాణులు మృతి చెందుతున్నాయి. తమిళనాడు రాష్ట్రంలోని పాలక్కాడ్ - కోయంబత్తూరు రూట్‌లో ఏనుగులు తరచుగా ట్రాక్‌లు దాటుతూ ప్రమాదానికి గురౌతున్నాయి. దీనిని నివారించేందుకు అక్కడి రైల్వే అధికారులు పలుచోట్ల కృత్రిమ మేథ - పవర్డ్ థర్మల్, స్టాండర్డ్ కెమె రాలను అమర్చారు. దీని వలన జంతువులు రైల్వే ట్రాక్‌ను దాటేందుకు వచ్చినప్పుడు ముందు గానే కంట్రోలర్లకు తెలిసిపోతుంది. దాంతో రైళ్ల వేగాన్ని తగ్గించి జంతువులు ఎలాంటి ఇ బ్బంది లేకుండా దాటేలా చేస్తున్నారు. అలాంటి విధానా న్నే ఇక్కడ అమలు చేయాలన్న డిమాండ్ ఉన్నది.



భౌ భౌ భయం

వీధుల్లో కుక్కల స్వైర విహారం

- రోడ్డుపై కనిపిస్తే కరుస్తోన్న గ్రామసింహాలు
- రాత్రుళ్లు హడలెత్తుతున్న పాదచారులు, బైకర్లు
- వీధి కుక్కల నియంత్రణలో నగర పాలక సంస్థ విఫలం

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):

ఇటీవల కుక్కల దాడిలో నగర శివారులోని స్వర్ణభారతినగర్ పక్కనున్న ఐద్వానగర్‌లో ఓ చిన్నారి ఐజక్ మృతి.

కొండా వెంకటప్పయ్య కాలనీలో ఇంటి వద్ద ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై ప్రతాపం చూపిన వీధి కుక్కలు.

ఇటీవల అర్ధరాత్రి రామనామక్షేత్రం రోడ్డులో బైక్‌పై వస్తున్న దంపతులపై వీధికుక్కలు దాడికి యత్నం.

గతంలో నల్లచెరువు, సంపత్‌నగర్.. ఇలా పలు ప్రాంతాల్లో చిన్నారులపైనే కా కుండా పెద్దవారిపైనా వీధి కుక్కలు రెచ్చి పోయి దాడులు చేశాయి.


.. ఇలా నగరంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అక్కడా ఇక్కడా అన్న తేడా లేకుండా పగలు రాత్రి అన్న బేధం లేకుండా వీధి కుక్కలు పదుల సంఖ్యలో నగరవాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గుంపులు గుంపులుగా ఉంటోన్న వీధి కుక్కలు రోడ్డుపై జనం కనిపిస్తే కాటేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించే వారినీ వదలకుండా వెంటాడి మరీ దాడి చేస్తున్నాయి. కుక్కల కారణంగా బైకుల పై నుంచి పడి తీవ్రంగా గాయప డుతున్న సంఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. ఇక వృద్ధులు, మహిళలు, పిల్లలు అయితే రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్నారంటే నగరంలో పరిస్థితి ఎంత భయానికంగా ఉందో తెలుసు కోవచ్చు. తోడేళ్ల మాదిరి కుక్కల జనంపై దాడి చేస్తున్నా నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. సోమవారం రాత్రి ఏటి అగ్రహారం శివరామనగర్‌లో ఓ పిచ్చి కుక్క కొన్ని వీధి కుక్కలతో కలసి స్వైర విహారం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. కుక్కల గుంపు చేసి విచక్షణా రహితంగా కనిపించిన వారిని కనిపించినట్లుగా కరిచేశాయి. ఇటీవల నగర శివారులోని కొండా వెంకటప్పయ్యకాలనీలో కుక్కలదాడిలో గాయపడి ఓ బాలుడు ఆస్పత్రి పాలవగా తాజాగా శివరామనగర్ ఘటనలో 25 మంది గాయపడ్డారు. గతంలో ఐద్వా నగర్‌లో చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే. ఇలా వరుస ఘటనలు వెలుగు చూస్తున్నా నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వీడటం లేదు. నగరంలో పాతగుంటూరు నుంచి ఇటు స్వర్ణభారతినగర్, అటు పొన్నూరు రోడ్డు, ఇటు అమరావతి రోడ్డు పరిధిలో ఆ ప్రాంతం ఈ ప్రాంతం అని తేడా లేకుండా వీధి కుక్కలు పదుల సంఖ్యలో రోడ్లపై తిరు గుతున్నాయి.

రాత్రి వేళల్లో రెచ్చిపోతున్న కుక్కలు..

రాత్రి వేళల్లో వీధి కుక్కలు మరింత రెచ్చిపోతున్నాయి. కాలనీల్లో ప్రధాన రహదారుల్లో తిష్ట వేసి రాకపోకలు సాగించే వారిపై ప్రతాపం చూపు తు న్నాయి. వీధుల్లో రాకపోకలు సాగించే వాహనదారులను వెంటపడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇక చిన్నారులు, వృద్ధులు ప్రాణాలు అర చేతుల్లో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

అసెంబ్లీలోనూ కుక్కల అంశం..

ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లోనూ పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి నగరంలోని వీధి కుక్కల సమస్యలపై గళమెత్తారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. వీధి కుక్కల కారణంగా ప్రజలు బిక్కు బిక్కుమంటూ ఉన్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా నగర పాలక సంస్థ అధికార యంత్రాంగంలో చలనం లేదనేందుకు ఆ తర్వాత జరిగిన ఘటనలే నిదర్శనంగా కనిపిస్తున్నాయి. కుక్కలకు కుని శస్త్ర చికిత్సలు చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలు పెద్ద సంఖ్యలో పెరగడం చూస్తే జీఎంసీ అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శిడిమాను మహోత్సవం (ఇన్‌సెట్లో అమ్మవారు)

శిడిమాను కోలాహలం

- భక్తిశ్రద్ధలతో కొండపాటూరు పోలేరమ్మ ఉత్సవం

కాకుమాను, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కొండపాటూరు స్వయంభు శ్రీపోలేరమ్మ తల్లి శిడిమానోత్సవం అశేష భక్త జన కోలాహలం మధ్య మంగళవారం వైభవంగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకుని వేకువ జామున అమ్మవారికి మహిళలు జలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలతో విశేషంగా అలంకరించారు. మహిళలు పొంగళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రైతులు పంట ఉత్పత్తులను అమ్మవారికి సమర్పించారు. తిరునాళ్లలో ముఖ్య ఘట్టమైన శిడిమాను ఉత్సవాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులు శిడిమాను ఉత్సవాన్ని తిలకించారు. కుంకుమ బండ్లు ఊరిగేంపు జరిగింది. ప్రభలలో దేవతా మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించిన బండ్లలో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు జరిపారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జయమ్మ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ముత్తినేని అనీల్‌కుమార్, ఈవో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

మేయర్ ఎన్నిక 28న

ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ

- జేసీ సమక్షంలో ప్రక్రియకు ప్రభుత్వం ఆదేశాలు
- 24లోగా కార్పొరేటర్లకు, ఎక్స్‌అఫిషియో సభ్యులకు నోటీసు



గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ నూతన మేయర్ ఎన్నిక ఈ నెల 28న జరగనున్నది. ఖాళీగా ఉన్న మేయర్ స్థానాన్ని భర్తీ చేయాలని ఎలక్షన్ కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఎన్నికల ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నెల 24లోగా కార్పొరేటర్లకు, ఎక్స్ అఫిషియో సభ్యులకు ఎన్నికల తేదీ గురించి తెలియజేస్తూ నోటీసులు జారీ చేయాలని నగరపాలక సంస్థ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. 28న ఉదయం 11 గంటలకు మేయర్ ఎన్నిక జరగనున్నది. ఈ ఎన్నిక ప్రక్రియను జేసీ భార్గవ్‌తేజ సమక్షంలో నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం సూచించింది. కలెక్టర్ నాగలక్ష్మి ప్రధానమంత్రి మోదీ పర్యటన ఏర్పాట్లలో ఉన్నందున ఎన్నిక ప్రక్రియ బాధ్యతను జేసీకి ప్రభుత్వం అప్పగించినట్లు సమాచారం. చేతులెత్తి మద్దతు తెలపటం ద్వారా ఎన్నిక జరుగుతుంది. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 57 మంది కార్పొరేటర్లు ఉండగా అందులో ఒకరు మృతి చెందారు. దీంతో 56 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు, ఒక ఎంపీ ఎన్నికలో పాల్గొనే అవకాశం ఉంది. ఇందులో టీడీపీకు 23, జనసేనకు ఆరుగురు కార్పొరేటర్లు ఉన్నారు. ఎక్స్‌అఫిషియో సభ్యులు ఐదుగురు కూటమి పక్షాన ఉన్నారు. అలాగే వైసీపీ పక్షాన 27 మంది కార్పొరేటర్లు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉన్నారు. దీంతో వీరి బలం 29గా ఉంది. మేయర్ ఎన్నిక సమావేశానికి హాజరైన సభ్యుల్లో సగానికి పైగా ఒక్క ఓటు మెజార్టీ ఉన్నా గెలుపొందినట్లే. ఈ లెక్కన గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ పీఠం కూటమి పరం కానున్నదని తెలుస్తోంది. ఇప్పటికే కూటమి తరుపున మేయర్ అభ్యర్థిగా టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర (నాని) పేరును అధిష్ఠానం సూచించడంతో ఆయన ఎన్నిక ఇక లాంఛనమే. కాగా వైసీపీ ఈ సమావేశానికి హాజరవుతుందా లేదనేది ఇంకా నిర్ధారణ కాలేదు. హాజరు కాని పక్షంలో ఎన్నిక ఏకగ్రీవం కానున్నది.

పీఎస్ఆర్ కాదు.. వైఎస్సార్ ఆంజనేయులు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర



పొన్నూరుటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ నాడు అధికార అహంకారంతో వైఎస్ఆర్ ఆంజనేయులుగా వ్యవహరించారని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మంగళవారం ధ్వజమెత్తారు. పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టు చట్టానికి ఎవరూ అతీతులు కారనడానికి నిదర్శనమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏసీబీ డీజీ, ఇంటిలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరించిన పీఎస్ఆర్ తన అధికారాలను ఉపయోగించి తెలుగుదేశం పార్టీ నాయకులనే కాకుండా... విభేదాలున్న వ్యక్తులను, మహిళలను తప్పుడు కేసులతో అరెస్టు చేసి వేధించిన తీరు రాష్ట్ర ప్రజలందరూ చూశారన్నారు. వైసీపీ పాలనలో అపరిమిత అధికారాలను వినియోగించి, ఎంతో మందిని బెదిరించడమే కాకుండా తనకు ఉన్న అధికార పరిధిని దాటి అక్రమ కేసులు బనాయించి దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎంతో మంది మహిళల కన్నీటికి కారకుడని, రాష్ట్ర యువత భవిష్యత్‌ను అంధకారం చేసిన వ్యక్తి పీఎస్ఆర్ అని మండిపడ్డారు. ఏపీపీఎస్సీ కార్యదర్శిగా ఉండి పరీక్ష పత్రాల అంశంలో అవకతవకలకు పాల్పడ్డారని, ప్రతిభ ఉన్న యువతను కాకుండా పైరవీ కారులకు పెద్ద పీట వేసిన దుస్థితి వైసీపీ పాలనలో జరిగిందని ఆరోపించారు. అధికార మదం, అధికార దుర్వినియోగం చేసే అధికారులు చట్టం నుంచి తప్పించుకోలేరని.. పీఎస్ఆర్ అరెస్టుతో మరోసారి అది నిరూపితమైందని ధూళిపాళ్ల అన్నారు.

26న రేవులకు వేలం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని నాలుగు రేవులకు ఈ నెల 26న వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీల్డ్ టెండర్ల ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. అచ్చంపేట మండలంలోని చింతపల్లి, మాదిపాడు, మాచవరం మండలంలోని గోవిందాపురం, కొల్లిపర మండలంలోని వల్లభాపురం రేవులకు బహిరంగ వేలం జరుగుతుందని తెలిపారు. ఉదయం 10:30 గంటలకు వేలం ప్రారంభం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

గుంటూరు మీదగా భువనేశ్వర్, యశ్వంత్‌పూర్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తొలగించేందుకు గుంటూరు మీదుగా భువనేశ్వర్, యశ్వంత్‌పూర్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు మే 24 నుంచి జూన్ 28వ తేదీ వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకి బయలుదేరి ఆదివారం ఉదయం 8.35 గంటలకు గుంటూరు, 9.20కి నరసరావుపేట, అర్ధరాత్రి దాటాక 12.15కి యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. నంబరు 02812 యశ్వంత్‌పూర్- భువనేశ్వర్ ప్రత్యేక రైలు మే 26 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతి సోమవారం వేకువజామున 4.30 గంటలకి బయలుదేరి మధ్యాహ్నం 3.19 గంటలకు నరసరావుపేట, 4.30 గంటలకు గుంటూరు, మంగళవారం ఉదయం 6కు భువనేశ్వర్ చేరుకుంటుందన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు

● మే 2న బాధ్యతల స్వీకరణ

గుంటూరు(లీగల్), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 106 కోర్టుల్లో పనిచేస్తున్న జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా కోర్టు పరిధిలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు. గుంటూరు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వి.దీప్తిని ఇక్కడే ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్స్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆమె స్థానంలో భీమవరంలో రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న డి.ధనరాజును నియమించారు. గుంటూరు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.నవ్యశ్రీని.. ఒంగోలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో జగ్గయ్యపేట జూనియర్ సివిల్ జడ్జి మైలాబత్తుల శోభారాణిని నియమించారు. ఎక్సైజ్ కోర్టులో జడ్జి జి.స్పందనను అనకాపల్లి జిల్లా యలమంచిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో గిద్దలూరు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారా ధనమ్మను నియమించారు. గుంటూరులో ఆరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి(సీఐడీ కోర్టు) కె.శ్రుతవిందను విశాఖపట్నంలోని ఏడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్‌ను నియమించారు. మహమ్మద్ గౌస్ స్థానంలో అనంతపురం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సుజన్ కుమార్‌ను నియమించారు. రాజమండ్రి ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.జగదీశ్వరిని బదిలీపై గుంటూరు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నియమించారు. మంగళగిరి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబును.. అక్కడే ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కాకినాడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రసన్నలక్ష్మిని నియమించారు. బాపట్లలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణిని పొన్నూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియ మించి... పొన్నూరులోనే ఖాళీగా ఉన్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బాధ్యతలను కూడా నిర్వహించాలని ఆదేశించారు. కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.కళ్యాణిని బాపట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. నరసరావుపేట ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.ప్రవల్లికను పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జిగా నియమించి.. అక్కడ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం.మురళి గంగాధరరావును రంపచోడవరానికి బదిలీ చేశారు. నరసరావుపేటలో ప్రవల్లిక బదిలీతో ఖాళీ అయిన స్థానంలో ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.సలోమినీ నియమించారు. రేపల్లెలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఖాళీ అయిన ఆమె స్థానంలో మచిలీపట్నంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడి వి.దేవి సాయి శ్రీవాణిని నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా బదిలీ అయిన జూనియర్ సివిల్ జడ్జిలంతా మే 2వ తేదీ లోగా తమ కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు.

ప్రపంచ కార్మికవర్గ శ్వాస లెనిన్

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ



లెనిన్ జయంతి సభలో ప్రసంగిస్తున్న రామకృష్ణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పీడిత, తాడిత ప్రజా పోరాటాలకు మార్గ నిర్దేశం చేసిన మహనీయుడు వీఐ లెనిన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. గుంటూరు సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన లెనిన్ 155వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. లెనిన్ 1917లో అక్టోబర్ మహా విప్లవం వల్ల రష్యాలో ప్రప్రథమ సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించారని గుర్తుచేశారు. తన జీవిత కాలంలో లెనిన్ ప్రపంచ కార్మిక విప్లవ ప్రగతిపై చెరగని ముద్ర వేశారని కొనియాడారు. విప్లవోద్యమ గమనంలో సంభవించే రకరకాల మలుపుల్లో సరైన ఎత్తుగడలు అనుసరించడంలో లెనిన్ తనకు తాను సాటి అనిపించుకున్నారని గుర్తుచేసుకున్నారు. విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఆయన రచనలు నిరంతరం అధ్యయనం చేయడం అవసరమని సూచించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ లెనిన్ స్ఫూర్తితో మతోన్మాద పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. లెనిన్ విగ్రహానికి రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందెల నాసర్ జీ, పుప్పాల సత్యనారాయణ, గని, మేడా హనుమంతరావు, కోటా మాల్యాద్రి, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ కె.గంగాధర్ రావు పేర్కొన్నారు.విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో యూజీసీ స్పాన్సర్ రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ అన్ మ్యానెడ్ ఏరియల్ వెహికల్స్ అడ్వాన్సెస్, అప్లికేషన్స్ కార్యక్రమం డైక్ మెన్ ఆడిటోరియంలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గంగాధర్ ప్రారంభించి, మాట్లాడారు.ఎన్.వి.డి.ఐ టెక్నాలజీని ఉపయోగించి,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని డ్రోన్‌లో ఉపయోగిస్తున్నారని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీలో అన్ని విభాగాల విద్యార్థులు ప్రతిభ సాధించాలని కోరారు. కీనోట్ స్పీకర్‌గా విచ్చేసిన ఏపీ డ్రోన్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ గడిమి శెట్టి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని డ్రోన్ హబ్ గా మార్చాలని కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లును డ్రోన్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు. ఆర్అండ్‌డీ మ్యానుఫ్యాక్చరింగ్ పవ మాన్ ఏవియేషన్ సీటీఓ విజయ్ వీరమల్లు, పవమాన్ ఏవియేషన్ ఎకౌంటబుల్ మేనేజర్, ఆర్.పి.టి.ఒ హృషికేశ్ వాడ్కర్, ఏరో మైండ్స్ డ్రోన్ సర్వీసెస్ సీ.ఈ.ఓ వంశీధర్ మజ్జి, పూర్వ విద్యార్థి, ట్రీడీ హబ్స్ సీఈఓ సాయి కృష్ణ అనురూప్ పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తొలుత అతిథులను డాక్టర్ విజయ్ ప్రకాష్ పరిచయం చేశారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఎండీ తౌషిఫ్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ట్రెజరర్ డాక్టర్ సీహెచ్. తిరుమలరావు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, రెక్టర్ ఆచార్య రత్న శీలామణి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ఎం. గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్ర మౌళి మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బోయపాటి పూర్ణ చంద్రశేఖర్, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో మునిగి వృద్ధురాలి మృతి

రేపల్లె, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుమూడి పుష్కర ఘాట్‌కు సోమవారం సాయంత్రం వచ్చిన.. వట్టిచెరుకూరు మండలం గాడపారకు చెందిన పోలూరి ధనలక్ష్మి(74) కృష్ణా నదిలో మునిగి చనిపోయినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. సమాచారాన్ని బంధువులకు తెలిపామన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతికి గల కారణాలు విచారిస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

ఇంజనీరింగ్ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

● ఎంబీఏ రీ వ్యాల్యుయేషన్ ఫలితాలు కూడా..

● ఏఎన్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి

పెదకాకాని, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల మొదటి సెమిస్టర్ 1/4 ఫలితాలను వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. ఎంబీఏ, ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ పునఃమూల్యాంకన ఫలితాలనూ విడుదల చేసినట్లు ఆయన వెల్లడించారు. బీటెక్ 4/1, 4/4 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను బుధ వారం విడుదల చేసే విధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

ప్రారంభమైన న్యాయశాస్త్ర సెమిస్టర్ పరీక్షలు

● ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీజీ కోర్సుల సమన్వయకర్త సుబ్బారావు

పెదకాకాని, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నుంచి న్యాయశాస్త్రం కోర్సులు ఎల్ఎల్ఎం ప్రథమ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ), మూడేళ్ల ఎల్.ఎల్.బి ప్రథమ సెమిస్టర్, ఐదేళ్ల బీఏ ఎల్.ఎల్.బి ఐదవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయం పరిధిలోని గుంటూరులో రెండు, నరసరావుపేటలో ఒకటి, వర్సిటీ క్యాంపస్ కళాశాలలో ఒకటితో పాటు ప్రకాశం జిల్లాలోని ఒక పరీక్ష కేంద్రంలో పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాలను తనిఖీ బృందాలు సందర్శించాయి. రెండు పరీక్ష కేంద్రాల్లో చూచిరాతకు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేశాయి. విశ్వవిద్యాలయం పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు వర్సిటీ పరీక్ష కేంద్రంలో పరీక్ష తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనర్‌గా సుజిత్ మల్లిక్



బాధ్యతలు స్వీకరిస్తున్న సుజిత్ మల్లిక్

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కన్నావారితోటలోని సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్‌లో నూతన కమిషనర్‌గా సుజిత్ మల్లిక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు కమిషన రేట్ పరిధి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు (ఐదు జిల్లాలు) విస్తరించి ఉంది. నూతన కమిషనర్ భువనేశ్వర్ నుండి గుంటూరుకు ప్రమోషన్‌పై వచ్చారు. సుజిత్ మల్లిక్ రూర్కెలాలోని ఆర్ఈసీ (ప్రస్తుతం ఎన్ఐటీ) నుండి బీఈ (మెకానికల్ ఇంజనీరింగ్)ను 1997-2001లో పూర్తి చేశారు. ఒడిశాలోని అంగుల్‌లో నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్‌లో పనిచేసిన ఆయన 2007లో ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)లో చేరారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ నార్కోటిక్స్ (నాసెన్), ఫరీదాబాద్‌లో ప్రొబేషన్ ట్రైనింగ్ పూర్తి చేశారు. అనంతరం మొదటి పోస్టింగ్ కోల్‌కతాలోని ఎయిర్ కార్గో కాంప్లెక్స్, ఎన్ఎస్‌సీబీఐ ఎయిర్‌పోర్ట్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరారు. అక్కడ ఆయన ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్, ఎస్ఐఐబీ, డ్రాబ్యాక్ వంటి విభాగాలను చూశారు. 2017లో జాయింట్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొంది పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి కస్టమ్స్‌లో పనిచేశారు. జీఎస్టీ అమలుకు ముందు, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌లతో ఉన్న అంతర్జాతీయ సరిహద్దులోని ల్యాండ్ కస్టమ్స్ స్టేషన్ల కంప్యూటరైజేషన్‌లో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. 2019 నుండి 2022 వరకు ఒడిశా ప్రభుత్వంలోని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో జాయింట్ సెక్రటరీగా డిప్యూటేషన్‌పై పనిచేశారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్‌కు (సీబీఐసీ) తిరిగి వచ్చిన అనంతరం ఆయన భువనేశ్వర్ జోన్‌లో జీఎస్టీ కస్టమ్స్ విభాగాల్లో పనిచేశారు. సీజీఎస్టీ గుంటూరు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లిక్‌ను పలువురు అధికారులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

25న ఏపీఆర్ఎస్ క్యాట్, ఏపీఆర్‌జేసీ డీసీ సెట్-2025

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్ఎస్ క్యాట్, ఏపీఆర్‌జేసీ డీసీ సెట్-2025 ఈనెల 25న నిర్వహిస్తున్నామని నాగార్జున సాగర్ ఏపీ ఆర్‌జేసీ ప్రిన్సిపల్, పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ ఎన్.సరోజిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఆర్ఎస్ క్యాట్ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

సివిల్స్‌కు ఎంపికైన డాక్టర్ పెండెం ప్రత్యూష్



సత్తెనపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన న్యాయవాది పెండెం బాబూరావు తనయుడు పెండెం ప్రత్యూష్ సివిల్స్‌కు ఎంపికయ్యాడు. మంగళవారం ప్రకటించిన యూపీఎస్సీ ఫలితాల్లో 797 ర్యాంకు సాధించారు. ప్రత్యూష్ ఎంబీబీఎస్ చదువుతూ 2021-22లో మెడికల్ సైన్స్ ఆప్షన్‌గా తీసుకొని సివిల్స్ రాశారు. ప్రిలిమినరీ పాసైనప్పటికీ మెయిన్స్ ఆగింది. గుంటూరు మెడి కల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి.. ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సేవలు అందిస్తూ 2023 - 24లో ఆంత్రో పాలజీని ఆప్షన్‌గా ఎన్నుకొని సివిల్స్ రాశారు. తొలి ప్రయత్నంలో సివిల్స్ రానప్పటికీ ఎంబీబీఎస్ సీటు సాధించి వైద్య సేవలు అందిస్తూనే సివిల్స్ లక్ష్యాన్ని సాధించారు. తల్లిదండ్రులు బాబూరావు, పద్మల ప్రోత్సాహంతోనే ప్రత్యూష్ సివిల్స్‌కు ఎంపికయ్యారు. కష్టపడి చదివితే యువత అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని ప్రత్యూష్ తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు న్యాయవాదులు సమాచారం తెలుసుకొని వారి గృహానికి వెళ్లి ప్రత్యూష్‌ను అభినందించారు. తమ కుమారుడు సివిల్స్‌కు ఎంపిక కావటం ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

పిడుగురాళ్ల సీటీవోకు 830వ ర్యాంకు



వావిలపల్లి భార్గవ

పిడుగురాళ్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో పిడుగురాళ్ల సీటీఓ వావిలపల్లి భార్గవ 830వ ర్యాంక్ సాధించారు. విజయ నగరం జిల్లా సారథి గ్రామానికి చెందిన ఆయన రాజాంలో ప్రాథమిక విద్య, జీఎంఆర్ ఐటీలో ఇంజనీరింగ్ పూర్తిచేశారు. 2017 నుంచి 2019 వరకు స్టేట్ బ్యాంక్‌లో అసోసియేట్‌గా పనిచేశారు. గ్రూప్-1 ఇంటర్వ్యూకు 2018-22లో హాజరై 2022లో సెలక్టయ్యారు. ప్రస్తుతం పిడుగురాళ్ల జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం ప్రకటించిన యూపీఎస్సీ సివిల్స్ ఫలితాలలో ర్యాంక్ సాధించిన భార్గవ.. ఇంట్లోనే చదువుకుంటూ 4వ ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్‌కు సెలక్ట్ అయ్యారు. భార్గవ తండ్రి విష్ణు స్కూల్ హెచ్ఎంగా పనిచేస్తుండగా.. తల్లి గృహిణి. సివిల్స్‌కు ఎంపిక కావడమే తన జీవిత లక్ష్యమని భార్గవ తెలిపారు.

ఉపాధ్యాయుల కేటాయింపుల్లో అసమానతలను సరిదిద్దాలి

-యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను నాలుగు రకాలుగా విభజించి, విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి రకరకాలుగా నిర్ణయించడం సరికాదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇది అన్ని పాఠశాలల్లో ఒకే రకంగా ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల బదిలీల చట్టంపై మంగళవారం యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ స్కూల్లో 30 మంది పిల్లలకు ఒక టీచరు, మోడల్ ప్రైమరీ స్కూల్లో 20 మంది పిల్లలకు ఒక టీచరు, హైస్కూల్ ప్రైమరీలో 10 మంది పిల్లలకు 1 టీచరు కేటాయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎస్ కుసుమకుమారి, రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంత రావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, సహాధ్యక్షులు జీ వెంకటేశ్వర్లు, నాగమణి, జిల్లా కోశాధికారి దౌలా జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

ప్రజల గొంతెండుతుంటే కనిపించడం లేదా?

● వారం రోజులుగా నీటి సరఫరా లేకుంటే ఏం చేస్తున్నారు?

● మున్సిపల్ సిబ్బందిపై ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): 'వారం రోజులుగా నీళ్లు లేక కాలనీలవాసులు గొంతెండుతుంటే కనీసం మానవత్వం చూపించలేకపోయారా? మాకు ఒక్క ఫోన్ వస్తే పరుగులు పెడుతూ వచ్చాం.. మీకు చలనం కలగడం లేదా?' అంటూ మునిసిపల్ అధికారులపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్దిరాల కాలనీ వాసులు తమకు తాగునీరు సరిగా అందడం లేదని సోమవారం అర్ధరాత్రి ఎమ్మెల్యే నసీర్‌కు ఫోన్‌కాల్ ద్వారా సమాచారమిచ్చారు. దీంతో మంగళవారం ఉదయాన్నే ఎమ్మెల్యే నసీర్ కాలనీకి చేరుకుని స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే తాగునీటి సరఫరాలో అంతరాయానికి కారణమని గుర్తించి సంబంధిత వాల్వ్ ఆపరేటర్లు విశాలాక్షి, ఫైన్ వేల్‌లను వెంటనే సస్పెండ్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వార్డుల్లో బైక్‌పై పర్యటన

టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉదయాన్నే ఎమ్మెల్యే నసీర్ గడ్డిపాడు, మంగళ దాస్ నగర్, గణేష్ నగర్, రాజగోపాల్ నగర్ ప్రాంతాల్లో బైక్‌పై పర్యటించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం వంటి సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య వచ్చినా ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రిహాన, వేల్పూరి కిరణ్, చట్టు కనకారావు, పల్లె పోగు రమేష్, ఖాసీం బాబు, చాట్ల విజయబాబు, ఖాసీం వలి, సాంబశివరావు, ఇమ్రాన్, నూర్, సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఈస్టు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ ప్రత్యేక సెల్

గుంటూరు తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, ప్రజలు దానిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నసీర్ కోరారు. సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులు పలువురికి ఆయన రూ.26 లక్షల విలువ చేసే చెక్కులను మంగళవారం అందజేశారు. పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించడానికి వీలుగా సీఎంఆర్‌ఎఫ్ సహాయపడుతోందని, అది సీఎం మంచి మనసుకు నిదర్శనమన్నారు.

పుడమి పరిరక్షణ.. మన బాధ్యత

● ఏపీ రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య సంరక్షణ, భూమి పరిరక్షణకై బాధ్యత తీసుకోవాల్సిన తరుణం ఆసన్నమైనదని రెడ్‌క్రాస్, ఏపీ శాఖ చైర్మన్ వైడీ రామారావు అన్నారు. కలెక్టరేట్ బంగ్లా రోడ్డు, భారతీయ విద్యాభవన్లో కాలుష్య నియంత్రణ మండలి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రపంచ ధరిత్రి దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవుడు తన అవసరాల కోసం ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను దుర్వినియోగం చేస్తూ భావితరాలకు కాలుష్యంతో నిండిన పుడమిని అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అన్ని విద్యాసంస్థల్లో ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకం వంటి అంశాలతో అవగాహన తరగతులు నిర్వహిస్తామని అన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి హిమశైలజ మాట్లాడుతూ అధిక విద్యుత్ వినియోగం, అనవసర నీటి వాడకం, వృక్షాలను నరకడం వంటి చర్యలతో భూమి సమతుల్యత దెబ్బతింటుందని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు మాట్లాడుతూ కాలుష్యం లేని సమాజాన్ని భావితరాలకు అందేలా కృషి చేయాలన్నారు. జిల్లా పర్యావరణ ఇంజనీర్ నజీనా బేగం మాట్లాడుతూ ప్రజలు ముందుకు వచ్చి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, అప్పుడే భూతాపాన్ని నియంత్రించుకోగలుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్, జిల్లా కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ రవి, భారతీయ విద్యా భవన్ ప్రిన్సిపాల్ హేమాంబ తదితరులు పాల్గొన్నారు.



అవర్ పవర్-అవర్ ప్లానెట్ గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న వైడీ రామారావు, హిమ శైలజ, నజీనా బేగం, రామచంద్రరాజు తదితరులు

పాఠశాలల బలోపేతానికే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

● డీఈవో సీవీ రేణుక

గుంటూరు (విద్య) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసినందుకు ప్రత్యేకంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక వెల్లడించారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఆమె మంగళవారం అడ్మిషన్ పత్రాలు అందజేశారు. డీఈవో రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వం మెరుగైన విద్య అందిస్తుందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు యూనిఫామ్‌తో పాటు మధ్యాహ్న భోజన పథకం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోధన అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేలా చైతన్యం తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులందరూ సమష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా తమ వంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో అడ్మిషన్లకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఏసురత్నం, కామన్ ఎగ్జామినేషన్ బోర్డు చైర్మన్ తిరుమలేష్, ఉర్దూ డీఐ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్కే ఎండీ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న డీఈవో రేణుక

ఫార్మసీ విద్య, పరిశ్రమల మధ్య అంతరాలు తొలగాలి

● చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర

గుంటూరు (విద్య) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్(చిప్స్)లో ఓరల్ డోసేజ్ టెక్నాలజీ పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏసీజీ లాబ్స్, ముంబై సహకారంతో మంగళవారం విజయవంతంగా వర్చువల్ ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర వెల్లడించారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఫార్మసీ విద్య, పరిశ్రమల మధ్య ఉన్న అంతరాన్ని తొలగిస్తూ ఆధునిక ఫార్మాస్యూటికల్ ఉత్పత్తి ప్రక్రియలు వినూత్నతలపై ప్రత్యక్ష అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

బుడంపాడు సబ్‌స్టేషన్‌కు గ్రహణం!

● పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం

● అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు



బుడంపాడులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 33కేవీ సబ్‌స్టేషన్

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం పరిధిలోని బుడంపాడులో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభానికి గ్రహణం పట్టినట్లయింది. పనులు పూర్తి చేసి ఆరు నెలలకు పైగా గడుస్తోన్నా ప్రారంభంపై ఆ శాఖ అధికార యంత్రాంగం మీన మేషాలు లెక్కిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఏపీసీపీడీసీఎల్ యంత్రాంగం కోట్లాది రూపాయలతో నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే నగరంతో పాటు రూరల్ మండలంలోని పలు ప్రాంతాల విద్యుత్ కష్టాలు తీరినట్లవుతుంది. నాణ్యమైన విద్యుత్‌సరఫరా కోసం ఏర్పాటు చేసిన బుడంపాడు సబ్‌స్టేషన్‌ను మూడేళ్ల కిందటే పనులు చేపట్టారు. ఆ ప్రాంతంలో స్థలాన్ని సేకరించి కోట్లాది రూపాయలతో సబ్‌స్టేషన్‌నిర్మాణ పనులు పూర్తి చేశారు. అంతా పూర్తై ప్రారంభమవుతుందని ఆశించిన తరుణంలో అధికారుల మదిలో ఏముందో ఏమో తెలియదు కానీ కనీసం సబ్‌స్టేషన్ ప్రారంభం ఊసే ఎత్తటం లేదని ఆ శాఖ వర్గాల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల సబ్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రారంభానికి స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులును కూడా ఆహ్వానించారు. అయితే ప్రారంభం రోజుకు ముందే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దాంతో ప్రారంభం కాస్త వాయిదా పడినట్లయింది. మొత్తానికి బుడంపాడు సబ్‌స్టేషన్ ప్రారంభానికి గ్రహణం ఎప్పుడు వీడుతుందో వేచి చూడాల్సిందే.

నగరంలో మరో సబ్‌స్టేషన్‌కు కసరత్తు

జిల్లా కేంద్రం గుంటూరులో నానాటికి పెరుగుతోన్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా మరో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇప్పటికే ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నగరంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం మరో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌నిర్మాణం కోసం స్థల సేకరణ చేయాల్సి ఉందని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి ఇప్పటికే అధికారులకు ప్రతిపాదనలు పంపారు. అయితే స్థల సేకరణ పెద్ద సమస్యగా మారిందని చెబుతున్నారు. స్థల సేకరణ పూర్తయితే త్వరలో నగరంలో మరో సబ్‌స్టేషన్ అందుబాటులోకి రానున్నది.



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, డివిజన్ల వారీగా మెరుగైన పారిశుధ్య పనులు జరిగేలా ప్రజారోగ్య అధికారులు బాధ్యత తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ మంగళవారం గోరంట్ల, అరండల్‌పేట, అమరావతి రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ కార్మికులు తమకు కేటాయించిన ఇళ్లల్లో నూరు శాతం చెత్త సేకరణ చేయాలని, మధ్యాహ్నం సమయంలో అంతర్గత డ్రెయిన్లను శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పర్యటనలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. ఆర్టీవో కార్యాలయం వద్ద గల అన్న క్యాంటీన్‌ని పరిశీలించి టిఫిన్ చేస్తున్న ప్రజలతో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

5 శాతం రాయితీతో పన్ను చెల్లింపునకు 8 రోజులే గడువు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోపు ఏకమొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ లభిస్తుందని, ఇప్పటి వరకు 32,041 మంది ఈ రాయితీని వినియోగించుకొని రూ.24.50 కోట్లు చెల్లించారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సర్వీసు పూర్తి చేసిన వారిని క్రమబద్ధీకరించాలి

● కలెక్టరేట్ ఎదుట సీహెచ్‌వోల ధర్నా

గుంటూరు సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ గుంటూరు జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ప్రవళిక మాట్లాడుతూ గత ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారం కోసం కనీసం దృష్టి సారించలేదని అన్నారు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరిస్తారన్న ఆశతో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారిని క్రమబద్ధీకరించటంతో పాటు, రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న జీతాల పెంపు వ్యవహారంలో ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని అసోసియేషన్ కార్యదర్శి లింగరాజు అన్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ ఎన్.దీక్షిత, చీఫ్ అడ్వయిజర్ కొడాలి సృజన, జిల్లాలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



గుంటూరు కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీహెచ్‌వోలు

మార్క్సిజాన్ని, లెనినిజాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మార్క్సిజాన్ని, లెనినిజాన్ని నేటి రాజకీయ పరిణామాల నేపథ్యంలో మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని సీపీఎం సీనియర్ నాయకుడు పాశం రామారావు అన్నారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో లెనిన్ 155వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక చట్టాలను రద్దు చేస్తూ పెట్టుబడిదారులకు ప్రజల సొమ్మును కారు చౌకగా కట్టబెడుతున్నారని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే లెనిన్‌కిచ్చే ఘన నివాళులని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి, ఈమని అప్పారావు, బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ జయంతి సభలో మాట్లాడుతున్న పాశం రామారావు, పాల్గొన్న సీపీఎం నాయకులు

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు సోలార్ అసెంబ్లింగ్‌లో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉండి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. శిక్షణతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్ సాఫ్ట్ స్కిల్స్ లేదా అంశాల్లో నైపుణ్యం కల్పిస్తామని సూచించారు. ఇతర వివరాలకు 70326 47212లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తి తగ్గుముఖం!

● ఏపీ శ్యాక్స్ పీడీ నీలకంఠ రెడ్డి వెల్లడి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తి తగ్గుముఖం పట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి (ఏపీ శ్యాక్స్) ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి నీలకంఠరెడ్డి వెల్లడించారు. ఆయన మంగళవారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఎయిడ్స్ చికిత్సా కేంద్రంతో పాటు పీపీటీసీటీ, వీసీటీసీ కేంద్రాలను సందర్శించారు. ఆయన వెంట ఏపీ శ్యాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్, డ్యాప్కు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ శ్యాంసన్, ఐసీటీసీ కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్ జే.వీరాస్వామి పాల్గొన్నారు. నీలకంఠరెడ్డి మాట్లాడుతూ కొంతకాలంగా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న అవగాహన కార్యక్రమాలతో హెచ్ఐవీ వ్యాప్తిరేటు తగ్గుముఖం పట్టిందన్నారు. తొలుత ఆయన వీసీటీసీ కేంద్రం సందర్శించి అక్కడ జరుగుతున్న హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. కౌన్సెలర్లతో మాట్లాడారు. అనంతరం గైనకాలజీ ఓపీ విభాగంలోని ప్రివెన్షన్ పేరెంట్స్ టు చైల్డ్ ట్రాన్స్‌మిషన్ (పీపీటీసీటీ) విభాగం పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న సేవలను పరిశీలించారు. హెచ్ఐవీ పాజిటివ్ గర్భిణీకి జన్మించే శిశువుకు నిర్వహించే డ్రైడ్ బ్లడ్ స్పాట్ (డీబీఎస్) పరీక్షల తీరును పరిశీలించారు. అనంతరం ఎయిడ్స్ చికిత్సా కేంద్రం (ఏఆర్‌టీ సెంటర్)ను సందర్శించారు. గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగంలో నిర్వహించే ఎస్ఆర్ఎల్ ల్యాబొరేటరీ సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



ల్యాబ్ సిబ్బందితో మాట్లాడుతున్న నీలకంఠ రెడ్డి

పోషణ ట్రాకర్ యాప్‌లో గర్భిణుల స్వీయ నమోదు : సీడీపీవో

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పోషణ ట్రాకర్ యాప్‌లో గర్భిణులు తమంతట తాము రిజిస్ట్రేషన్ చేసుకునేలా యాప్‌ను ప్రభుత్వం రూపొందించిందని సీడీపీవో కృష్ణవేణి అన్నారు. గుంటూరు అర్బన్ ప్రాజెక్టు వెస్ట్ సెక్టార్ 5లో మంగళవారం జరిగిన పోషణ పక్వాడ్ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీ అయినప్పటి నుంచి బిడ్డకి రెండు సంవత్సరాలు వచ్చే వరకు కూడా వెయ్యి రోజుల సంరక్షణ కార్యక్రమం అంగన్వాడీలలో చేపడుతున్నారని గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి గర్భిణీ అంగన్వాడీలో నమోదు చేసుకొని సేవలు పొందాలని సూచించారు. నోడల్ ఆఫీసర్ శ్రీవాణి మాట్లాడుతూ బలహీనంగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. చిన్నప్పటి నుంచే వారికి బలమైన ఆహారం ఇవ్వాలన్నారు. ఆరోగ్యవంతమైన గర్భిణీ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తుందని చెప్పారు. డాక్టర్ చందన మాట్లాడుతూ ఎండాకాలంలో డిహైడ్రేట్ అవ్వకుండా పిల్లలు, గర్భిణీ, బాలింతలు ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల్లో ఇచ్చే సేవలను ప్రతి ఒక్క లబ్ధిదారులు ఉపయోగపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గర్భిణీలకు సీమంతాలు, ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే చేశారు. కార్యక్రమానికి వెస్ట్ 5 సూపర్వైజర్ తబిత అధ్యక్షత వహించగా డీసీపీవో విజయ్ కుమార్ పాల్గొన్నారు

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశాన్ని ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఏర్పాటు చేయాలని, కాకపోతే ఈ మధ్య నిర్వహించడం లేదన్నారు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. మోదీ సభ తరువాత ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ సభ్యులు లక్ష్మీనారాయణ, వై నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరెడ్డి, నాగభూషణం, శ్రీనివాస్ ఉన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగవద్దన్నందుకు ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంపత్ నగర్ 2వ లైన్‌కు చెందిన ఉలవకట్టు ప్రవీణ్ దాస్(21) హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రికవరీ ఏజెంట్‌గా పని చేసే వాడని పోలీసులు తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై రోజు మద్యం తాగి ఇంటికి వచ్చేవాడని, ఆయన తమ్ముడు అజయ్‌కుమార్, తల్లి మద్యం తాగవద్దని మందలించే వారన్నారు. ఈ నెల 20న రాత్రి సమయంలో ప్రవీణ్ దాస్ మద్యం తాగి ఇంటికి రాగా తల్లి మందలించింది. దీంతో క్షణికావేశంలో ప్రవీణ్‌దాస్ ఇంటిలో గల ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడని, అది గమనించిన తమ్ముడు, చుట్టుపక్కల వారు అతనిని చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తమ్ముడు అజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోరంట్లలో వ్యక్తి అదృశ్యం

రాజస్థాన్ నుంచి వచ్చి గోరంట్ల సున్నపు బట్టీల వద్ద వినాయకుని విగ్రహాలు తయారు చేస్తుండే మంగిలాల్ సోలాంకి (48) అదృశ్యమయ్యాడు. ఈ నెల 20న ఉదయం ఇంటి వద్ద నుంచి వెళ్లి పోయాడని, ఎత్తు 5.5 అడుగులు, రంగు చామన ఛాయ, సన్నగా ఉంటాడని, ఖాకీ రంగు ప్యాంటు, మెరూన్ రంగు చొక్కా ధరించి ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నల్లపాడు పోలీసులకు 8688831376, 8688831606లో తెలియజేయాలని కోరారు.



మంగీలాల్ సోలంకి

నోరు పారేసుకుంటే రోజాకు గుణపాఠం తప్పదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత ఆర్కే రోజా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్యంపై ఇష్టానుసారం నోరు పారేసుకుంటున్నారని, మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే తగిన గుణపాఠం చెప్తామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ నేతల మాటలు రోజురోజుకి శృతి మించిపోతున్నాయని అన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలను ప్రజలు చెప్పులతో కొడతారన్న రోజా వ్యాఖ్యలు ఆమె దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. అధికారమదంతో చేసిన అకృత్యాలకు ఈ రోజు మూల్యం చెల్లించుకుంటున్నారని, ఒక మహిళను నిర్బంధించి, చిత్రహింసలు పెట్టిన కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్ట్ అయితే దానిని కూడా అక్రమం, అధర్మం అంటూ ఒక దుర్మార్గమైన వ్యక్తికి మద్దతుగా నిలవటం చూస్తుంటే, మహిళలు రోజాను చూసి అసహ్యించుకుంటున్నారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు పంచభూతాలను సైతం వదలకుండా దోచేసి, నేడు నీతి వాక్యాలు బోధిస్తే నమ్మడానికి ప్రజలు ఎవరు సిద్ధంగా లేరన్నారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో ఆర్కే రోజా చేసిన స్కామ్‌పై త్వరలోనే విచారణ మొదలు కాబోతున్నదని, రోజా జైలుకి వెళ్ళటానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు ఆయన సొంత డబ్బుతో అమరావతిలో ఇంటి నిర్మాణానికి స్థలం కొనుగోలు చేశారని, జగన్‌రెడ్డి లాగా ప్రజాధనాన్ని దోచుకొని తిని బెంగుళూరు ప్యాలెస్‌లు నిర్మించుకోవడం లేదన్న విషయం రోజా గుర్తు పెట్టుకోవాలన్నారు.

పీఎస్ఆర్ అరెస్టు ముమ్మాటికీ సక్రమమే

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి రాగానే ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు తన పేరును వైఎస్సార్ ఆంజనేయులుగా మార్చుకొని తీవ్రమైన అవినీతి, అరాచకాలకు పాల్పడ్డాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీజీపీని చేస్తానన్న జగన్ మాటనమ్మి ఆయన చేయని పాపం లేదని మండిపడ్డారు. జగన్ అండ చూసుకొని నాడు నవ్వుతూ చేసిన పాపాలకు నేడు ఏడుస్తూ శిక్ష అనుభవించక తప్పదని అన్నారు. జగన్ ఏలుబడిలో ముంబై నటి జత్వాని కుటుంబాన్ని అత్యంత దారుణంగా వేధించి, వారందరిపై తప్పుడు కేసు పెట్టి 55 రోజులు జైల్లో పెట్టిన పాపం ఎక్కడికి పోదన్నారు. పీఎస్సార్ ఎక్కడ పని చేసినా అక్కడ మహిళలను తీవ్రంగా బెదిరించటం, ఆపై వేధించడం నిత్య కృత్యమైపోయిందని విమర్శించారు. జత్వానీ కేసుతో పాటు ప్రస్తుత ఉప సభాపతి రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో కీలకంగా వ్యవహరించారని ఆరోపించారు. జగన్ అవినీతిని ప్రశ్నించిన నెల్లూరు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కొందరు న్యాయమూర్తుల ఫోన్ ట్యాపింగ్ చేసిన నేర చరిత్ర పీఎస్సార్‌దేనని అన్నారు. గతంలో రాజశేఖరరెడ్డి, జగన్‌తో అంటకాగిన నేతలు, సివిల్ సర్వీసు అధికారులు జైలు కెళ్లిన సంగతిని ఆయన గుర్తుచేశారు. లిక్కర్ కుంభకోణంలో జగన్ పీకల్లోతు మునిగిపోయాడని, విజయసాయిరెడ్డి మాటలతో, రాజ్ కసిరెడ్డి అరెస్టుతో తాడేపల్లి ప్యాలెస్ కంపించిపోతుందని కనపర్తి అన్నారు.

పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టు సమంజసం

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాదు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాజీ ఇంటిలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టు సమంజసమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. గుంటూరు, బృందావన్‌గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమాశంలో మాట్లాడుతూ పీఎస్ఆర్ ఆంజనేయులు తన విధి నిర్వహణలో అధికార పరిధికి మించి చెలరేగిపోయాడన్నారు. జగన్ తాను చెప్పినట్లు నడుచుకునే విధంగా ఆంధ్ర శశికళ నిర్వహించిన నాటకంలో ఆంజనేయులు ప్రధాన పాత్ర వహించాడని దుయ్యబట్టారు. హిందీ సినీ నటి కాదంబరి జేత్వానిని ఆంధ్ర పోలీసులకు ఎటువంటి సంబంధం లేకపోయినా ఎవరినో మెప్పించేందుకు అక్రమ కేసులు పెట్టి వేధించాడని అన్నారు. ప్రత్యేకించి మహిళల కేసుల్లోనే పి ఎస్ఆర్ ఆంజనేయులు ఎందుకు శ్రద్ధ చూపారో కూటమి ప్రభుత్వం ఆ దిశగా విచారణ చేయాలని సూచించారు. ఆంధ్ర శశికళ చేసిన అన్ని దుర్మార్గాలు, నేరాలు, కుట్రల్లో ప్రధాన పాత్ర పిఎస్ఆర్ ఆంజనేయులు వహించాడని తెలిపారు. ఫోన్ల ట్యాపింగ్‌లో పీఎస్సాఆర్ సిద్ధహస్తుడని, తన ఫోన్ కూడా ట్యాప్ చేశాడని అన్నారు. టీడీపీలో కమ్మ సామాజికవర్గంలో ఉన్న మాజీ ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడాననే కారణంతో నా ఫోన్‌ను ట్యాప్ చేసాడని అన్నారు. కార్యక్రమంలో మెరిగల మణికుమార్, అత్తోట జోసఫ్ కుమార్, చాపర్తి గోపి తదితరులు పాల్గొన్నారు.

మహాభారతం- వనవాసం ప్రవచనం



ప్రవచనం చేస్తున్న శ్రీకూర్మనాథస్వామి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మహాభారతం అరణ్యపర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి ప్రవచిస్తూ మహాభారతంలో వనవాసం పాండవుల జీవితంలో ఒక కీలక ఘట్టమని అన్నారు. ఆ సమయంలో పాండవులు రుషుల నుంచి జ్ఞానాన్ని పొందారు. నారదుడు, ద్వైమానుడు వంటి రుషులు వారికి అనేక కథలు, సూక్తులను చెప్పారని తెలియజేశారు.

దుగ్గిరాల యార్డులో పెరిగిన పసుపు విక్రయాలు

● 1818 బస్తాల పసుపు అమ్మకం

దుగ్గిరాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో విక్రయాలు గణనీయంగా పెరిగాయి. 2025 సీజన్ ప్రారంభమయ్యాక నిన్నమొన్నటి వరకూ 1000 బస్తాలకు మించిన పసుపు విక్రయాలు జరిగిన రోజులు వేళ్ల మీద లెక్కించవచ్చు. ధరలో స్వల్పంగా మార్పున్నప్పటికీ మోడల్‌ధర రూ.11 వేల వరకూ పలుకుతుండటం కొంతమేర రైతులకు ఊరట కలిగిస్తోంది. గతవారంతో పోల్చుకుంటే విక్రయాలు పెరిగినప్పటికీ ధరలు స్థిరంగా ఉన్నాయని చెప్పవచ్చు. మంగళవారం జరిగిన వేలంలో 1818 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.11,050, గరిష్ఠధర రూ.12,150, మోడల్‌ధర రూ.11,780 పలికాయి. కాయ కనిష్ఠధర రూ.11,050, గరిష్ఠధర రూ.12,150, మోడల్‌ధర రూ.11,780 పలికాయి.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన టీడీపీ నేతలు



మంత్రి అచ్చెన్నాయుడుకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాగులపాడు టీడీపీ నేతలు

పెదనందిపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడులో మే 14న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు రావాలని కోరుతూ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు టీడీపీ నాయకులు విజయవాడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. పార్టీ స్థితిగతులపై, గ్రామాల అభివృద్ధి గురించి నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి నాగబాబు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, నాయకులు పాటిబండ్ల నాగేశ్వరరావు, పాటిబండ్ల రాంబాబు, పాటిబండ్ల నాగబాబు, ఆళ్ల రాజారావు, ఆళ్ల నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షుడు శివ మృతి

పెదనందిపాడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షుడు, టీడీపీ నియోజకవర్గ బీసీ సంఘ కార్యదర్శి వరగాని శివ(48) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. పెదనందిపాడు సీజీజీబీ బ్యాంకులో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేసుండేవాడు. భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి పలువురు టీడీపీ నాయకులు, సంఘ సభ్యులు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు చిన హనుమయ్య ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు-1 బ్రాంచి వారి సూచనలు పొంది యుండుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... తురకా అక్కయ్య గారి కుమారుడు తురకా రవి గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు తురకా సాయి పవన్‌కి గారికి ఋణం మంజూరు చేయును.

సి -షెడ్యూలు : మనలో నెం.3కువారైన తురకా రవి గారికి రాబడిన ఆస్తి వివరము : గుంటూరు డి. కొరిటెపాడు సబ్.డి. గోరంట్ల గ్రామ పంచాయితీ ఏరియాలో చేరి, ప్రస్తుతం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన గోరంట్ల గ్రామ డి.నెం. 469/3రు య.4-55 సెంట్లు మింజుమలె మనకు హక్కు కలిగిన య.0-04 సెంట్లు లేక చ.గ.192.1 లు స్థలము అందలి అసెస్మెంటు నెం. 134593 రు, డోరు నెం. 6-19కు గల ఆర్.సి.సి. దాబా యింటిలో మనలో నెం.3 రు వారి వాటాకు రాబడిన దక్షిణం, ఉత్తర భాగమున మధ్య గల చ.గ.47-9లు స్థలము అందలి ఆర్.సి.సి దాబా యిల్లు స్థలమునకు హద్దులు. తూర్పు : సర్కారు బజారు హద్దు అ.13-9లు, దక్షిణం : మనలో నెం.2కు వారి వాటాకు రాబడిన బి-షెడ్యూలు దాఖలాస్తి హద్దు అ.31లు, పడమర : మనలో నెం. 1 రు వారి వాటాకు రాబడిన ఏ- షెడ్యూలు దాఖలాస్తి హద్దు అ.13-9లు, ఉత్తరం : మనలో నెం.4రు వారి వాటాకు రాబడిన డి-షెడ్యూలు దాఖలాస్తి హద్దు అ.31లు. ఈ హద్దుల మధ్య గల చ.గ.47.9లు లేక ,జమీజ 40-04 ఛ స్థలము అందలి ఆర్.సి.సి. దాబా యిల్లు. ఈ ఆస్తి కి సంబంధించిన DOC No: 4533/2017, SRO. ప్రత్తిపాడు

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన CanFin Homes Ltd., Mangalagiri Branch, Mangalagiri వారి సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు వద్దకు గుంటూరు జిల్లా మంగళగిరి మున్సిపాలిటీ ఆరవ పటాలము క్వార్టర్ నెం.:S3a/56 కాపురస్థురాలు శ్రీపతి శ్రీనివాసరావు గారి భార్య శ్రీపతి నాగమణి గారు ది.7-12 2024 తేదీన విక్రయ దస్తావేజు నెం.16552/2024 ఎస్.ఆర్.ఓ.మంగళగిరి ద్వారా దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని కుందుర్తి సుమలత వగైరాల వద్ద నుండి క్రయం పొంది ఆ తథాది సర్వ సంపూర్ణ హక్కు భుక్తములతో అనుభవించుచున్న ఆస్తిఅని, అట్టి ఆస్తికి చెందిన ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 10732/2019 పోయినదని సదరు విషయమై మంగళగిరి టౌన్ పోలీస్ వారికి ఫిర్యాదు చేసి వారి వద్ద నుండి ది.15-03-2025న నాన్ ట్రేసబుల్ సర్టిఫికేట్ పొంది ఉన్నానని చెప్పుచూ నా క్లయింటును ఋణంకొరకు సంప్రదించియున్నారు. కావున ఎవరికైనా పోయిన దస్తావేజు పై గాని, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపైగాని ఏవిధమైన తనఖాలు, తాకట్లు, కోర్టు జప్తులు, ఇతర క్లెయిములు వగైరాలు వున్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోగా నాకు గాని, నా క్లయింటుకు గాని వ్రాతపూర్వకమైన ఆధారములతో తెలియజేయగలరు. గడువులోగా ఎటువంటి క్లెయిములు వగైరా రానియెడల నిష్కేచి ఆస్తిగా భావించి నాక్లయింటు సదరు శ్రీపతి నాగమణి గారికి ఋణం మంజూరు చేసెదరని తదుపరివచ్చు ఎట్టి క్లెయిములు షెడ్యూలు ఆస్తిని గాని, నాక్లయింటు హక్కులను గాని బైండ్ చేయజాలవు.

షెడ్యూలు:గుంటూరు డి॥, మంగళగిరి సబ్.డి॥ యిలాకా, మంగళగిరి మున్సిపల్ ఏరియాలో చేరిన, మంగళగిరి రెవెన్యూ గ్రామకంఠం తాలూకు సర్వే నెం.232/1ఎఫ్ 2 గుర్తు, య.2.70సెంట్లు మింజుమలేలోని, మంగళగిరి మున్సిపల్, డోర్. నెం.5-165/బి85 గల ఇంటికి ఉత్తరం వైపున గల చ.గ. 169-4లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు:తూర్పు:మున్సిపల్ సిమెంటు రోడ్డు హద్దు, అ.42-26లు,దక్షిణం:గతంలో చుక్కా అప్పల నరసమ్మ గారిస్థలము ప్రస్తుతం అమలు లోనికి రాబడిన సిమెంటు రోడ్డుహద్దు, అ.36లు, పడమర: గుర్రం జగన్నాథం వగైరాల ఆస్థి హద్దు, అ.42-26లు, ఉత్తరం:కాశయ్య గారి ఆస్థి హద్దు,అ.36లు. ఈ నాలుగు హద్దులమధ్యనగల చ.గ.169-4లు లేక చ.మీ.141.63ఛ్లు స్థిరాస్తి నివేశన స్థలము, సదరు మొత్తము స్థలంలో నిర్మించబడివున్న గ్రూప్ హౌస్ గ్రౌండ్ ఫ్లోర్ నందలి ఉత్తరంవైపు అనిర్దిష్టపు అవిభాజ్యపు హక్కుగల చ.గ.28.3లు లేక చ.మీ. 23.66ఛ్లు స్థలమున్నూ.

కట్టడ వివరం:గ్రూప్ హౌస్ లోని గ్రౌండ్ ఫ్లోర్లో ఉత్తరంవైపు గల ఆర్.సి.సి.దాబా ఇంటికి హద్దులు: తూర్పు:కామన్ ఏరియా హద్దు, దక్షిణం:మద్దాళి సుబ్బారావు గారి ఇల్లు హద్దు,పడమర:ఓపెన్ టూ స్కై, ఉత్తరం:ఓ పెన్ టూ స్కై. ఈ నాలుగు హద్దుల మధ్యనగల చ.అ.738లు ప్లింత్ ఏరియా, చ.అ. 246లు కామన్ ఏరియా, సెల్లార్‌లో గల పార్కింగ్ యావద్విశిష్టములతో సహా.

జి. శ్రీలక్ష్మీ, అడ్వకేట్,
7-19-20/1 8వ లైను, కాకుమానువారితోట,
గుంటూరు. సెల్ : 9490756252

గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

● ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలి
● అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి
● అధికారులకు ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆదేశం



మేడికొండూరులో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తదితరులు

మేడికొండూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ సూచించారు. మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల అభివృద్ధిపై సమీక్ష మంగళవారం మేడికొండూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడటానికి వీల్లేదని చెప్పారు. నీటి ఎద్దడి ఏర్పడితే అందుకు అధికారులే బాధ్యత వహించాలని అన్నారు. అదేవిధంగా మండలాల పరిధిలో అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల పనితీరు మెరుగుపరచాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని, మూడో శనివారం తప్పనిసరిగా ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు జడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, మేడికొండూరు ఇన్‌చార్జి ఎంపీడీవో పాటిబండ్ల పూర్ణ శంకరరావు, పంచాయతీరాజ్ డీఈ కొండయ్య, హౌసింగ్ ఈఈ ఎ.శంకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ, డీఎల్‌పీవో శ్రీనివాసరావు, ఫిరంగిపురం ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో జె.ప్రసాదరావు తదితరులతో పాటు మాజీ జడ్పీటీసీ సభ్యులు పాములపాటి శివన్నారాయణ ఫిరంగిపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు దండా సాంబిరెడ్డి, కొత్తపల్లి కోటేశ్వరరావు రెండు మండలాల్లోని గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో..



సమీక్షలో పాల్గొన్న తాడికొండ, తుళ్లూరు మండలాల అధికారులు

తాడికొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో తాడికొండ, తుళ్లూరు మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయా గ్రామాల్లో ఏఏ సమస్యలున్నాయి, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. తాడికొండ, తుళ్లూరు మండలాల టీడీపీ నాయకులు గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నందున, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు ప్రస్తుతానికి నిలిపివేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పరిశుభ్రతను పాటించాలన్నారు. కాల్వలు, డ్రైనేజ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. హౌసింగ్, రవాణ, తదితర అంశాలపై అధికారులు ఎప్పటికప్పుడు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సమతావాణి, తహసీల్దార్ మెహర్‌కుమార్, తాడికొండ, తుళ్లూరు మండలాల అధ్యక్షులు తలశిల ప్రసన్నకుమార్, ధనేకుల సుబ్బారావు, ఎడ్డూరి హనుమంతరావు, పుట్టిరామచంద్రరావు, యడ్లపల్లి సాంబశివరావు, గుంటుపల్లి మధుసూదనరావు, గడ్డిపాటి సాంబశివరావు, నరసింహరావు, శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

● డీఈవో రేణుక



విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న డీఈవో రేణుక

గుంటూరు (విద్య) ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సీవీ రేణుక వెల్లడించారు. మంగళవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఆమె అడ్మిషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో సీవీ రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్య అందిస్తుందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు యూనిఫామ్‌తో పాటు మధ్యాహ్న భోజన పథకం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోధన అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేలా చైతన్యం తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులందరూ సమష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అడ్మిషన్లకు కృషిచేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో డీవైఈవో ఏసురత్నం, కామన్ ఎగ్జామినేషన్ బోర్డు చైర్మన్ తిరుమలేష్, ఉర్దూ డీఐ, బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్కే ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

పెళ్లి వేడుకలో చదివింపుల బ్యాగు చోరీ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెళ్లి వేడుకలో పెద్దలందరూ నిమగ్నమై ఉండగా చదివింపుల బ్యాగుతోపాటు బంగారు నగలు అపహరించుకుపోయిన ఘటన మంగళగిరిలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి పట్టణంలోని మార్కండేయ కల్యాణ మండపంలో ఈ నెల 21న ఓ పెళ్లి వేడుక జరిగింది. వధూవరుల బంధువులు, వివాహ వేడుకకు హాజరైన వారు పెళ్లి పనుల్లో తలమునకలయ్యారు. చదివింపుల సేకరణ బ్యాగును ఓ బాలిక వద్ద ఉంచగా, ఇది గమనించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆ బాలికను మాటల్లో పెట్టి చదివింపులు, బంగారు ఆభరణాలు కలిగివున్న బ్యాగును అపహరించుకుని పారిపోయాడు. కొద్దిసేపటి తర్వాత పెద్దలు వచ్చి బ్యాగును అడిగితే.. ఓ వ్యక్తి వచ్చి బ్యాగు తీసుకెళ్లాడని బాలిక సమాధానమిచ్చింది. దీంతో బ్యాగు చోరీకి గురైందని గ్రహించి పెళ్లికొడుకు మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ బ్యాగులో 6 బంగారు చైన్లు, 5 ఉంగరాలు, రూ.3.5 లక్షల నగదు ఉన్నట్టు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎన్‌ఆర్ఐ విద్యార్థులకు కియా మోటార్స్‌లో ఉద్యోగాలు



కియా మోటార్స్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

మేడికొండూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కియా మోటార్స్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 51 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాస్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ప్రముఖ కార్ల తయారీ కంపెనీ అయినా కియా మనదేశంలో ఎంతో ప్రాచుర్యం సంపాదించిందని, మంచి మోడల్స్‌తో ప్రజలకు ఆకర్షణీయంగా, మధ్యతరగతి ప్రజలకు అనుకూలమైన ధరలతో అందుబాటులో ఉన్న కియా కార్లు ఎంతో ప్రజాదరణ పొందాయని తెలియజేశారు. అటువంటి మల్టీ నేషనల్ కంపెనీలో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం హర్షణీయమని కొనియాడారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు కియా కంపెనీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్ఐ కళాశాల పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రవికుమార్, హెచ్‌వోడీలు శ్రావణి, వాసు, వైస్ ప్రిన్సిపాల్ మనోహర్, కళాశాల ఏవో బండారు సీతారామయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిరావు పాల్గొన్నారు. రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ఏపీ ప్రభుత్వ ఏపీఐటీఏ ఎం సత్యరత్నం, కియా మోటార్స్ మానవ వనరుల సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఉమాశంకర్ ఆదిభట్ల, హెచ్‌ఆర్ మేనేజర్ మనీష్ తదితరులున్నారు.

ప్రపంచ శాంతి కోసం పోప్ ఫ్రాన్సిస్ కృషి

● గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య



పోప్ ఫ్రాన్సిస్ నివాళి దివ్య పూజాబలిలో మాట్లాడుతున్న బిషప్ భాగ్యయ్య

ఫిరంగిపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతి కోసం పోప్ ఫ్రాన్సిస్ అవిరళ కృషి చేశారని గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మంగళవారం ఫిరంగిపురంలోని బాల ఏసు చర్చి ఆవరణలో గల ప్రదర్శనశాలపై పోప్ ఫ్రాన్సిస్ నివాళుల దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. 1969లో గురువుగా పట్టాభిషేకం పొంది అనంతరం ఆర్‌సీఎం చరిత్రలో అనేక పదవులు పొంది 2013లో పోప్ పదవిని అలంకరించారన్నారు. పోప్ పదవిలో అనేక సేవలు అందించారన్నారు. ముందుగా పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి పూలమాల వేసిన బిషప్ భాగ్యయ్య ఆయకు నివాళులర్పించారు.

పశ్చిమ డెల్టాకు 1016 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమడెల్టా పరిసరాల్లో తాగునీటి అవసరాల కోసం చెరువులు, బావులు నింపుకునేందుకు గానూ, విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి 1016 క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లెకాల్వకు 148 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 95, పశ్చిమకాల్వకు 45, నిజాంపట్నంకాల్వకు 151, కొమ్మమూరు కాల్వకు 482 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

తిరునాళ్లలో ఉప్పుటూరి సేవలు ప్రశంసనీయం : తహసీల్దార్



ఉప్పుటూరి చినరాములతో మాట్లాడుతున్న తహసీల్దార్

కాకుమాను, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి చెందిన కొండపాటూరు స్వయంభు శ్రీపోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్‌లు, పులిహోర ప్యాకెట్లు అందజేసిన ఉప్పుటూరి సీతామహాలక్ష్మి చారిటబుల్ ట్రస్టు చేసిన సేవలు ప్రశంసనీయం అని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా కొండపాటూరులో ఉప్పుటూరి చిన రాములు భక్తులకు మజ్జిగ ప్యాకెట్‌లు వాటర్‌ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. తిరునాళ్ల విధుల్లో ఉన్న తహసీల్దార్ చిన్నరాములును ప్రత్యేకంగా కలసి అభినందనలు తెలియజేశారు. కాకుమాను జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు చేస్తున్న సేవలను అభినందించారు. అలాగే అప్పాపురం వద్ద తిరునాళ్లకు వచ్చే భక్తులకు అభయాంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త కాటూరి అంకినీడు, కాకుమానులో నల్లజర్ల వెంకట్రావు తిరునాళ్లకు వచ్చే భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

త్వరలో వైద్యశాల నిర్మాణం చేపడతాం : డీఎంహెచ్‌వో

పెదనందిపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన ఆరోగ్య కేంద్ర నిర్మాణం త్వరలో చేపట్టనున్నట్లు డీఎంహెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ పెరిగే విధంగా చూడాలని, కాన్పులు కూడా జరిగేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. త్వరలో ఇద్దరు వైద్యాధికారులను నియమిస్తామని చెప్పారు.

పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి

● డీఎల్‌పీవో శ్రీనివాసరావు

పెదనందిపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి పొడి చెత్తలను సేకరించి పంచాయతీలకు సంపద సృష్టి కేంద్రాల ద్వారా ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని డీఎల్పీవో కె శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని పెదనందిపాడు, పాలపర్రులో మంగళవారం కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో తడిపొడి చెత్తలను వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని, దీంతో వర్మీ కంపోష్టు ఎరువు తయారు చేసి విక్రయించాలని సూచించారు. ప్రజలు రోడ్ల వెంట, సైడుకాల్వల్లో చెత్త చెదారాలు వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యదర్శులు శ్రీనివాసరావు, శ్వేతలకు క్లాప్ మిత్రలకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ వర్ధిని ఉన్నారు.

ముగిసిన శ్రీరామ నవమి ఉత్సవాలు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి డాక్టర్ ఆంజనేయ కాలనీలోని బోరింగ్ పంపు సెంటరు వద్ద 41 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శ్రీ సీతారామ భక్త సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రతిరోజు ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ గావించారు. 16 రోజుల పండుగ సందర్భంగా సోమవారం రాత్రి అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మహిళా భక్తులు ఊంజల్ సేవతో సీతారాముల పవళింపు సేవ నిర్వహించారు. ఈ ఉత్సవానికి తాటి సాంబశివరావు, శైలజ దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీతారామ భక్త సమాజం ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, విజయ, పెదలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

దుగ్గిరాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. చైత్ర మాసం నవమి, శ్రవణా నక్షత్రయుక్తలగ్నాన్ని పురస్కరించుకుని, స్వామికి ఉదయాన్నే నిర్వహించిన పలురకాల అభిషేకాలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అర్చకుడు రామచంద్ర అందించారు. ఉదయం 9గంటలకు అర్చకుడు సాకేత్‌శర్మ, రామచంద్రల నేతృత్వంలో ప్రారంభమైన కల్యాణోత్సవం మధ్యాహ్నం 12 గంటల వరకూ కన్నుల పండువగా కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులతోపాటు, స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు.

వజ్రోత్సవ లోగో ఆవిష్కరణ

● మే 10, 11 తేదీల్లో వేడుకలు

పెదనందిపాడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాలపర్రులో ఎస్ఎన్ జిల్లా పరిషత్ పాఠశాల 75వ వజ్రోత్సవ లోగోను సోమవారం పూర్వపు విద్యార్థులు ఆవిష్కరించారు. మే 10, 11 తేదీల్లో రెండు రోజులపాటు వేడుకలు నిర్వహించడం జరుగుతుందని, ఈ వేడుకల్లో పూర్వపు విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ పాఠశాలలో కావాల్సిన వసతులు, విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వంతో పాటు పూర్వపు విద్యార్థులు అందించాల్సిన సహకారంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ముద్దన శ్రీనివాసరావు, పూర్వపు విద్యార్థి సంఘ నాయకులు తేళ్ల ప్రభాకరరావు, పోపూరి రామచంద్రరరావు, కమ్మ నాగమల్లేశ్వరరావు, జంపని నాగేశ్వరరావు, స్యాంసన్, దొప్పలపూడి రమేష్‌బాబు, దుద్దెంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదను నివారించండి

తుళ్లూరు, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో కోతుల బెడద నివారించాలని స్థానికులు కోరుతున్నారు. నెల రోజుల నుంచి వాకింగ్ ట్రాక్‌లో, గ్రామంలో ఇళ్ల మీదకొచ్చి హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో జనాలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కోతుల బెడదను నివారించాలని పంచాయతీ కార్యదర్శి రమణను కోరారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని ఓ హోటల్‌లో పనిచేసే విజయనగరంనకు చెందిన భాస్కర్ (24)ను జోసఫ్ బీరు బాటిల్‌తో దాడిచేసి గాయపర్చాడు. తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌లో వైద్య చికిత్స నిమిత్తం తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతున్న భాస్కర్ మంగళవారం మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడు అవివాహితుడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

టీడీపీ కార్యాలయంలో ప్రతి శుక్రవారం గ్రీవెన్స్

తెనాలిరూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధులకు తెలిపి పరిష్కరించుకునేందుకు ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేశన కోటేశ్వరరావులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలిపేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ తెనాలిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. సమస్యలు ఉన్నవారు పూర్తి వివరాలను అర్జీ రూపంలో రాసి తీసుకువస్తే వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, కంచర్ల ఏడుకొండలు, కౌన్సిలర్ దివి అనిత, మల్లవరపు విజయ్‌కుమార్, కిలారి అనిత, అన్నం పిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులతో వృత్తి నైపుణ్యాలు: ఎంఈవో

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఒకేషనల్ కోర్సులు ఉపయోగపడుతున్నాయని మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బహుళ ప్రయోజన ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్నషిప్ సర్టిఫికెట్‌ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సమగ్ర శిక్ష నుంచి ఒకేషనల్ విద్యార్థులకు 12రోజులు ఇంటర్నన్‌షిప్ నిర్వహించినట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్స్ ఐటీ ద్వారా వస్తువుల వాడకం, వాటి మరమ్మతులు, కంప్యూటర్ బేసిక్ స్కిల్ వంటి అంశాలపై ఈ కోర్సుల ద్వారా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థులకు కోర్సుల ద్వారా వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు సాయం అందించినట్లు చెప్పారు. 60మంది పది విద్యార్థులకు ఇంటర్నన్‌షిప్ సర్టిఫికెట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ మల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాడు ఏడుకొండలు, ఒకేషనల్ ట్రైనర్‌లు దుర్గాబాయి, సురేంద్రబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులోని శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు, అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో శిడిమాను ఉత్సవం భక్తి శ్రద్ధలతో జరిగింది. బాడవడొంకలోని ఆలయం వద్ద ఆలయ అధ్యక్షుడు ఉల్లంగుంట్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శిడిమానుకు ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి శిడిమాను ఇటికంపాడు రోడ్డు వరకు జరిగిన ఊరేగింపులో భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. శిడిమాను ఉత్సవంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. పొన్నూరు. రూరల్ పోలీసులు ఆలయం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

లెనిన్‌కు ఘన నివాళి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసిన మహనీయుడు లెనిన్ అని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం లెనిన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లెనిన్ నిర్వహించిన సోషలిస్టు ఉద్యమం, దోపిడీరహిత సమాజ స్థాపన వంటి పోరాటాల గురించి వివరించారు. శ్రామికవర్గ సంక్షేమానికి లెనిన్ చేసిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి నాయకులు షేక్ అజీమ్, శ్రీనివాసరావు, నరసింహారావు, పక్రూన్, తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్ బెర్రీ స్కూల్‌లో మంగళవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫైర్‌సేఫ్టీ డ్రిల్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారులు విద్యార్థులకు అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రాణాలు రక్షించడానికి ప్రాథమిక చర్యలపై అవగాహన కల్గించారు. ప్రమాద సమయంలో ఇవ్వవలసిన ఫస్ట్ ఎయిడ్, అత్యవసర స్థితుల్లో సీపీఆర్ విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం, ఏవో శ్రీవిజయ్‌కుమార్, కో ఆర్డినేటర్లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ నిర్మాణం అంతేనా..!?



అన్న క్యాంటీన్ స్థలంలో కర్రలు పాతుతున్న పంచాయతీ సిబ్బంది

- ఏడేళ్ల క్రితం కొలకలూరులో భవన నిర్మాణానికి బేస్‌మెంట్ పూర్తి
- వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిన పనులు
- చిరు వ్యాపారులకు స్థల కేటాయింపునకు అధికారుల చర్యలు
- సర్వత్రా విస్మయం, క్యాంటీన్ నిర్మించాలని పలువురి వినతి

తెనాలి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పేదలకు మూడు పూటలా ఆహారం అందించేలా మండలంలోని కొలకలూరులో నాడు అన్న క్యాంటీన్ నిర్మాణానికి పనులు చేపట్టారు. ఈ క్రమంలో వైసీపీ అధికారంలోకి రావడంతో పనులను నిలుపుదల చేసింది. అప్పటికే బేస్‌మెంట్ పూర్తి చేసుకుని పిల్లర్ల పనులు మొదలయ్యాయి. పనులు ఆగిపోవడంతో.. ఐదేళ్లలో ఇనుప చువ్వలు తుప్పు పట్టి చిట్టడివిలా ముళ్లపొదలతో కప్పి నిండిపోయింది. ప్రస్తుతం అన్న క్యాంటీన్ నిర్మాణంపై.. పంచాయతీ అధికారులు అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయంతో స్థానికులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. రోడ్లపై చిరు వ్యాపారులకు ఆ స్థలాన్ని ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిసి పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే షాపుల కేటాయింపును నిలుపుదల చేసి, అన్న క్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ ఇన్‌చార్జ్ ఈవో కరిముల్లాను వివరణకోరగా పిచ్చిమొక్కలు పెరిగి ఉండటంతో వాటిని తొలగించామన్నారు. అన్న క్యాంటీన్‌కు కేటాయించిన స్థలంలో ఎటువంటి షాపులకు అనుమతులు ఇవ్వడంలేదన్నారు. పంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజల అభిప్రాయాలమేరకు తదుపరి చర్యలు చేపడతామని వివరణ ఇచ్చారు.

మార్కెట్ యార్డు రిజర్వేషన్ల ఖరారు?

- ⇒ పొన్నూరు మార్కెట్ యార్డు బీసీఈకే?
- ⇒ చైర్మన్ నియామకం కోసం కసరత్తు
- ⇒ నూతన రిజర్వేషన్లతో నేతలకు ఇబ్బందులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఐదు మార్కెట్ యార్డుల పాలకవర్గ నియామకాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్ల ప్రక్రియను అమలుచేసి పాలక వర్గాల నియామకం కోసం మార్గం సుగమనం చేసినట్లు తెలిసింది. ఇప్పటికే నియోజవర్గ ప్రజాప్రతినిధులకు అనధికారికంగా మార్కెటింగ్‌శాఖ, ప్రభుత్వ రిజర్వేషన్లపై సమాచారం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. గుంటూరు జిల్లాలో మొత్తం ఎనిమిది ఏఎంసీలు ఉండగా ఇప్పటికే మంగళగిరి, దుగ్గిరాల, ప్రత్తిపాడు కమిటీలకు పాలకవర్గాలు ఏర్పడ్డాయి. మిగిలిన ఐదు పొన్నూరు, తెనాలి, తాడికొండ, ఫిరంగిపురం, గుంటూరు యార్డులకు పాలకవర్గాల నియామకం స్థానిక ప్రజాప్రతినిధులకు సవాల్‌గా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని అక్రమ కేసులు, దౌర్జన్యాలతో వ్యతిరేకంగా పోరాడిన ద్వితీయ శ్రేణి నియోజకవర్గస్థాయి నాయకులు ఏఎంసీ పాలకవర్గాలపై గంపెడుఆశలతో ఎదురు చూస్తున్నారు. ఏఎంసీ పాలక వర్గం పదవులు నియోజకవర్గ స్థాయిలో ఉండటంతో ఈ పదవుల ద్వారా తమకు సముచిత స్థానం దక్కుతుందని కొండంత ఆశతో ఉన్నారు. జిల్లాలో మొదటి విడతగా దుగ్గిరాల, మంగళగిరి, పత్తిపాడు ఏఎంసీల పాలకవర్గాలను ప్రభుత్వం పూరించింది. ప్రస్తుతం మిగిలిఉన్న ఐదు యార్డులను రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్లు కరారు కావడంతో త్వరలోనే పాలక వర్గాల నియామకానికి నోటిఫికేషన్ విడుదలవనుంది.

రిజర్వేషన్లతో ఆశావాదుల్లో నిరాశ...

అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఏఎంసీల నియామకానికి రిజర్వేషన్ల ప్రక్రియ అమలు చేయడం ఆశావాదుల్లో నిరాశ నింపుతోంది. ఇప్పటి వరకూ జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లు అమలవుతాయని భావించిన నాయకులు రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్ల అమలు ప్రక్రియ ప్రారంభం కావడంతో అత్యధిక పాలక వర్గాలు రిజర్వేషన్ల కింద ఖరారు కావడంతోపాటు 50శాతం పాలకవర్గాలు మహిళలకు కేటాయించనున్నారు. అయితే ఇప్పటికే మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో మంగళగిరి ఏఎంసీ ఓసీకి కేటాయించారు. దీంతో మిగిలిన ఏఎంసీలు ఇతర రిజర్వేషన్ల కింద వెళతాయని ఆశావాదులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకూ ఏఎంసీ పదవులపై ఆశలు పెట్టుకున్న పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు నిరుత్సాహంలో మునిగిపోయారు. ఇప్పటి వరకూ ఏఎంసీలలో పదవులు వస్తాయని ఎదురుచూస్తున్న నాయకులకు కొత్త రిజర్వేషన్ల ప్రక్రియతో ఆశలు సన్నగిల్లుతున్నాయి. కొత్త రిజర్వేషన్లు కరారు కావడంతో ఏఎంసీ పదవులకు అభ్యర్థులకు ఎంపిక చేయడం కూడా ప్రజా ప్రతినిధులకు కొత్త ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. గత ఎన్నికల్లో అంగ, అర్థ బలాలు సమకూర్చిన ద్వితీయ శ్రేణి నాయకులు ఏఎంసీ పదవులు వస్తాయని చూసిన ఎదురుచూపులకు రిజర్వేషన్లు తీరని నిరాశని మిగిల్చాయి. పొన్నూరు మార్కెట్ యార్డు బీసీఈ రిజర్వేషన్‌కు ఖరారు అయినట్లు సమాచా రం. గతంలో పొన్నూరు ఏఎంసీ చైర్మన్లుగా ఎస్సీ, ఓసీ సామాజిక వర్గాలకు చెందిన వారు పనిచేశారు. ప్రస్తుతం బీసీఈ సామాజిక వర్గానికి పొన్నూరు ఏఎంసీ ప్రభుత్వం ఖరారు చేసినట్లు సమాచారం. బీసీ సామాజిక వర్గం నుంచి అభ్యర్థి ఎంపికకు కసరత్తు జరుగుతోంది.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నుంచి బాపట్ల వైపు వెళుతున్న ఆటో చేబ్రోలు సినిమాహాల్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ఆటో వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాపట్లకు చెందిన గోదాటి కిరణ్(35), ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదంపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి: సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాబుప్రసాద్

తెనాలిరూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న విద్యుత్ కార్మికుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెలించేలా కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ కోరారు. మంగళవారం పట్టణంలోని చెంచుపేట విద్యుత్ డీఈ కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, కాంట్రాక్ట్ కార్మిక సంఘంతో కలిసి ఆయన ఈఈకి వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు, కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ కార్యదర్శి ఎస్.నాగరాజు, గోపీనాథ్, సాంబశివరావు, డి.గోపి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై నిందితుడి అరెస్టు... రౌడీషీట్

తెనాలి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ మంగళవారం తెలిపారు. మండలంలోని గుడివాడకు చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్‌బాబు లైంగిక వేదింపులకు పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలు ఈ నెల 4న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా.. నిందితుడు పరారయ్యాడు. ఎస్ఐ ఆనంద్ సిబ్బందితో కలిసి మహేష్‌ను పట్టుకుని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. గతంలో ఇతనిపై ఆరు కేసులు ఉండటంతో రౌడీషీట్ తెరిచినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

4న వాసవీ ఆలయ కమిటీ సమావేశం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బోసు రోడ్డులోని శ్రీ వాసవీ ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశం మే4న జరుగుతుందని కమిటీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ కమిటీకి సారధ్యం వహించే విషయమై ఆర్యవైశ్యులు రెండువర్గాలయ్యారు. ఈ నేపథ్యంలో మరో వర్గానికి చెందిన ప్రతినిధులు మంగళవారం సమావేశం నిర్వహించి సర్వసభ్య సమావేశం ప్రకటించారు. సభ్యులంతా హాజరై కమిటీని ఎన్నుకోవాలని ఉప్పల వరదరాజులు, దేసు శ్రీనివాసరావు, అచ్యుతరావు, గంగాదరరావు, హరిప్రసాద్, శేషాచలం పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భావితరాలకు ఆరోగ్యం: మాధవి

కొల్లిపర, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయం చేసి భావితరాలకు మంచి ఆరోగ్యాన్ని అందివ్వాలని ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఖరీఫ్ ప్రణాళికపై ర్యాలీ నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలు నాగజ్యోతి, సుధారాణి, ఐసీఆర్పీలు ఝాన్సీ, రోజా, గోపి, కోటేశ్వరరావు, ఓబులయ్య, సునీల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలి: ఎంపీడీవో

కొల్లిపర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దావులూరు సచివాలయాన్ని ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామంలో మురుగునీరు సమస్య ఉందని గ్రామస్థులు తన దృష్టికి తీసుకువచ్చారని దానిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.

విద్యార్థులకు అడ్మిషన్ పత్రాల అందజేత

గుంటూరు (విద్య) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను డీఈవో సీవీ రేణుక అందజేశారు. మంగళవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమంలో డీఈవో పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్య అందిస్తుందన్నారు. మెరుగైన మౌలిక వస్తువులు కల్పిస్తోందని, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు యూనిఫామ్‌తో పాటు మధ్యాహ్న భోజన పథకం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బోధన అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేలా చైతన్యం తీసుకురావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో అడ్మిషన్లకు కృషిచేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఏసురత్నం, కామన్ ఎగ్జామినేషన్ బోర్డు చైర్మన్ తిరుమలేష్, ఉర్దూ డిఐ, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్‌ఎం ఎస్.కె ఎండి కాసిం తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయండి: ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సాక్షి భావనారాయణస్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశించారు. మే 4 నుంచి జరగనున్న సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఎమ్మెల్యే మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలకు సరైన ప్రాధాన్యం కల్పించలేదన్నారు. అధికారులు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకుని ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉత్సవాలలో ముఖ్యఘట్టమైన స్వామి వారి కల్యాణ మహోత్సం, రథోత్సవం ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించేలా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి: దండా

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరద్ధరణపై ముద్రించిన కర పత్రాలను పొన్నూరు, చేబ్రోలు మండలంలో సీఐటీయూ అనుబంధ సంఘ నాయకులు, సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయు అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి: డీఆర్‌డీఏ ఏపీఎం

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కోసం తీసుకుంటున్న రుణాలు సకాలంలో చెల్లించాలని డీఆర్‌డీఏ ఏపీఎం జోయబాబు కోరారు. మంగళవారం పట్టణంలోని పుష్ప హోట ల్ సెంటర్‌లో సమీకృత గ్రామీణ గిరిజన అభివృద్ధి సేవాసంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ప్రభుత్వం రైతులు, మహిళలకు అందిస్తున్న సబ్సిడీ రుణాలు, బీమా పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేవా సంస్థ కార్యదర్శి సాంబశివరావు, శంకరరావు, రిసోర్స్ పర్సన్ యశ్వంత్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి: హెచ్‌ఎం అనూరాధ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే నైపుణ్య శిక్షణ స్వయం ఉపాధికి దోహదపడుతుందని ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ చెప్పారు. అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 12 రోజుల శిక్షణ అందించారు. బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగంలో శిక్షణ ఇచ్చారు. ఫ్యాషన్ డిజైనింగ్, ఎంబ్రాయిడరీలో మరికొంత మంది విద్యార్థులకు శిక్షణ అందించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఒకేషనల్ ఉపాధ్యాయులు వెంకటేశ్వరమ్మ, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

పెరిగిన ఎండ తీవ్రత

● వీధుల్లో తగ్గిన జన సంచారం



తెనాలిలో ఎండతాకిడికి జన సంచారం లేని రోడ్డు, ఎండ వేడికి కండువా కప్పుకుని నడుస్తున్న పాదచారుడు

తెనాలి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎండ తాపానికి నిత్యం వందలాది వాహనాలతో, పాదచారులతో రద్దీగా కనిపించే తెనాలి రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ మార్కెట్ ప్రాంతంలో జన సంచారం కనిపిస్తుండగా., మధ్యాహ్నం 11.30నుంచి సాయంత్రం 3గంటల వరకూ రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆయా సమయాల్లో సుమారు 38డిగ్రీల నుంచి 39డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవడంతో.. బయట తిరిగేందుకు ఎవరూ సాహసించడంలేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి తెనాలి మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్ రోడ్డుకు ఉన్న ఫుట్ పాత్‌పై ఆకుకూరలు, కూరగాయలు, వివిధ రకాల పండ్లు అమ్ముకునే వ్యాపారులు సైతం ఎండ తీవ్రతకు సాయంత్రం ఉండడం లేదు. వివిధ పనుల నిమిత్తం వచ్చి వెళ్లేవారు మధ్యాహ్నం ప్రధాన రోడ్లపై ప్రయాణం చేయలేక చెట్లకింద ఉపసమనం పొందుతున్నారు. మరికొందరు తలకు కండువాలు, ముసుగులు ధరించి ప్రయాణిస్తున్నారు.

కారుణ్య ఆశ్రమానికి వృద్ధుల తరలింపు



ఆసుపత్రి నుంచి ఆశ్రమానికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

తెనాలి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వృద్ధులను గుంటూరు గోరంట్లలోని కారుణ్య ఆశ్రమానికి మంగళవారం తరలించారు. నా అనేవారులేక అనారోగ్య సమస్యలతో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వ్యాధి నయం అయిన తరువాత వారిని ఆశ్రమానికి తరలించి తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల వైద్యులు, తహసీల్దార్, మునిసిపల్ అధికారులు మానవత్వం చాటుకున్నారు. నాలుగురోజుల క్రితం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు అనారోగ్య సమస్యలతో ఇద్దరు వృద్ధులను అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. వారి అడ్రస్ ఇతర వివరాలు లభ్యంకాలేదు. బాగా నీరసించి నడవలేని స్థితిలో ఉన్నవారిని ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. అనంతరం వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి, తహసీల్దార్ గోపాలకృష్ణ, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ హెలెన్‌నిర్మల, ఓడీటీ ఏసురత్నంలు గుంటూరు సమీప గోరంట్లలోని కారుణ్య ఆశ్రమానికి తరలించారు. నిరాదరణకు గురైన వారిపట్ల మానవత్వం చూసిన అధికారులను పలువురు అభినందించారు.

చిరస్మరణీయుడు అక్కిశెట్టి బాబురావు

● టీడీపీ పట్టణాధ్యక్షుడు హరిప్రసాద్

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత అక్కిశెట్టి బాబురావు చిరస్మరణీయుడని పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. స్థానిక బోసురోడ్డులోని అన్నదాత సుఖీభవ సేవా సంఘ సభ్యులు ఏర్పాటుచేసిన వేసవి చలివేంద్రంలో టీడీపీ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత అక్కిశెట్టి బాబురావు 5వ వర్ధంతి ఆయన భార్య ఆదిలక్ష్మి 4వ వర్ధంతిని పురస్కరించుకొని అయన సోదరుడు అక్కిశెట్టి వెంకటేశ్వరావు, కుటుంబ సభ్యులు పాదచారులకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పాల్గొని మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మాదల కోటేశ్వరావు, మహ్మద్ ఖుద్దూస్, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, వెనిగళ్ల శివప్రసాద్, కన్నెగంటి గోపిచంద్, కుదరవల్లి శ్రీనివాసరావు, యల్లంకి సాంబశివరావు, పాములు, దేవినేని సురేష్, దంతాల ప్రేమ్‌కుమార్, శ్రీరామూర్తి, అన్నదాత సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు చెల్లించాలి

● ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అప్పారావు

తెనాలి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గుడివాడలో ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న వ్యవసాయ కూలీలను వ్యవసాయ కార్మిక సంఘం ఈమని అప్పారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డిలు కలిసి వారి యోగక్షేమాలను విచారించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా కూలి పనులకు వస్తున్న కార్మికులకు ఫిబ్రవరి, మార్చి నెలల్లోని పనిచేసిన డబ్బులు ఇంతవరకూ అందించలేదని ఆరోపించారు. రూ.307 కూలి కనీస వేతనంగా చెల్లించాల్సి ఉండగా కేవల రూ.250 మాత్రమే బిల్లువస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఉపాధి హామి కూలీల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు రైతుసంఘం సభ్యులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

గుప్తా కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. మంగళవారం కళాశాలలో దివీస్ ల్యాబొరేటరీ సంస్థ ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా 40మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ దుర్గారావు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను మేనేజర్ శ్రీనివాసరావు, విజయకృష్ణ తదితరులు అభినందించారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురం వద్ద ఉన్న పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశేష పూజలు జరిపారు. భక్తులు పసుపు, కుంకుమ, మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి పూజలు జరిపారు. ధర్మకర్త వీరయ్య, గుంటి వెంకట్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం పూజలు అనంతరం భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య: ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యను అందిస్తున్నట్లు ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అప్పారావు ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణతో పాటు నృత్య పోటీలు, దేశభక్తి గేయాలు, నాటికలను ప్రదర్శించారు. విద్యార్థుల నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈవో సాల్మన్‌రాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. ఎంఈవో ఝాన్సీలత మాట్లాడుతూ ప్రభుత్వం కూడా విద్యార్థులకు తగిన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు దివి, ఉమాదేవి, వహాబ్, నీలవేణి కస్తూరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దళిత కుటుంబాన్ని బహిష్కరించడం దుర్మార్గం

● ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక సభ్యులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని మల్లం వద్ద దళితులపై సామాజిక బహిష్కరణ దుర్మార్గమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక సభ్యులు ఖండించారు. మంగళవారం పట్టణంలోని ఐక్యవేదిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 80ఏళ్లు కావస్తున్నా దళితులపై వివక్ష మాత్రం రూపుమాపలేకపోతున్నారన్నారు. విద్యుదాఘాతం కారణంగా మరణించిన దళిత వ్యక్తి కుటుంబానికి పరిహారం నిరాకరించడమే కాకుండా భూస్వాములు ఆ కుటుంబంపై సామాజిక బహిష్కరణ దారుణమన్నారు. ఉప ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలోని దళితులకు రక్షణకల్పించడంతోపాటు బాధిత కుటుంబానికి రూ 25లక్షలు పరిహారం అందించాలని కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు.షేక్ దుబాయ్‌బాబు, కనపర్తి సతీష్‌కుమార్, తుమ్మల తులసి, ఏతాటి అనీల్, రాజేష్, రవిచంద్ర, పెరికల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.